



తీవ్ర నిరాశ కలిగించింది

మంత్రివర్గ సమావేశంలో రాష్ట్ర వ్యాప్తంగా 6100 పోస్టుల కోసం మాత్రమే డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వనున్నట్టు ప్రకటన వచ్చింది. గత ఐదేళ్లుగా ఒక ప్రకటన కూడా లేనందువల్ల ఒకేసారి 20వేల నుంచి 25 వేలకు ప్రకటన వస్తుందనుకున్నాం. అయితే అతి తక్కువ పోస్టులకు నోటిఫికేషన్ రావడం. నిరుద్యోగులను తీవ్ర నిరాశకు గురిచేసింది.

- వసుధ, ధర్మవరం



దగా డీఎస్సీ!

ధర్మవరం, ఫిబ్రవరి 3: వైసీపీ ఐదేళ్ల పాలనా కాలం ముగుస్తున్న దశలో ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తామని ప్రకటించడంపై నిరుద్యోగుల తో పాటు పలు వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. మూడు రోజుల కిందట జరిగిన మంత్రి మండలి సమావేశంలో రాష్ట్ర వ్యాప్తంగా 6100 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డీఎస్సీ నిర్వహిస్తామని ప్రకటించారు. 20వేలకు పైగా ఖాళీలు ఉన్నా ఇంత తక్కువ సంఖ్యలో పోస్టులు భర్తీ చేయడమంటే దగా చేయడమేనని నిరుద్యోగులు మండిపడుతున్నారు. 117 జీఓ ముసుగులో ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను ప్రభుత్వం కుదించింది. విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తిని తగ్గించారు. ఈ నేపథ్యంలో శ్రీసత్యసాయి జిల్లాలో ఎస్జీటీ పోస్టులు భారీగా కోల్పోవాల్సివచ్చింది. పాఠశాల విలీనం, రేషనలైజేషన్ ప్రక్రియతో పోస్టులకు కోత పెట్టారు. ఉన్నతపాఠశాలలో ఖాళీగా ఉన్న స్కూల్ అసిస్టెంట్ పోస్టులను అర్హత కలిగిన ఎస్జీటీలతో భర్తీ చేయడంతో అవి కూడా తగ్గిపోయాయి. జిల్లా పరిషత్, ప్రభుత్వ, మున్సిపాలిటీ, సంక్షేమ, ఆశ్రమ పాఠశాలల్లోని ఖాళీలు భర్తీ చేయాలని భావిస్తున్నట్టు సమాచారం. జిల్లాలో జడ్పీ ఉన్నతపాఠశాలల్లో 182 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇంగ్లిష 94, గణితం 13, హిందీ 34, ఫిజికల్ సైన్స్ 19, బయాలజీ 2, సోషియల్ 9, తెలుగు 9, పీడీ 64, ఉర్దూ 2 టీచర్ పోస్టులు ఖాళీ ఉండటంతోపాటు ప్రాథమిక పాఠశాలలో 95 ఎస్జీటీ పోస్టులు ఖాళీగా ఉన్నట్టు విద్యాశాఖ గణాంకాల ద్వారా తెలుస్తోంది.



కొరవడిన స్పష్టత

డీఎస్సీ ప్రకటనకు ముందుగానే ఖాళీల వివరాలు ప్రభుత్వం సేకరించాల్సి ఉంటుంది. ఎన్ని ఖాళీలు ఉన్నదీ ప్రభుత్వం సమగ్ర వివరాలు కోరలేదని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. జనవరి 31వ తేదీ వరకు ఉద్యోగ విరమణ చేసిన వారు, మృతుల వివరాలు సేకరించడానికి అధికారులు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఎప్పటి నుంచో ఖాళీలు గుర్తించాలనే అంశంపై తర్జనభర్జన పడుతున్నట్టు తెలుస్తోంది.

మెగా డీఎస్సీ మాటిచ్చారు : విజయ్‌కుమార్, ధర్మవరం

రాష్ట్రంలో తమ పార్టీ అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ నిర్వహిస్తామని పాదయాత్ర సమయంలో సీఎం జగన్ మాటిచ్చారు. ప్రభుత్వం ఏర్పడి ఐదేళ్లవుతోంది ఈ మధ్యలో ఒక్క డీఎస్సీ కూడా ఇవ్వలేదు. ఎన్నికల ముందు అరకొర పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వనుండటం బాధాకరం. ఎందరో బీఈడీ, టీటీసీ పూర్తి చేసి ఉద్యోగాలు రాక దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రభుత్వం పునరాలోచించి పోస్టుల సంఖ్యను పెంచి న్యాయం చేయాలి.

విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్న జగన్

మెగా డీఎస్సీ పేరుతో దగా: మాజీమంత్రి పల్లె

పుట్టపర్తిరూరల్ ఫిబ్రవరి 3: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రచారం పిచ్చి పరాకాష్టకు చేరిందని, బహిరంగ సభకోసం ఇంటర్మీడియట్ పరీక్షలను వాయిదావేసి విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నాడని మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి శనివారం ఓ ప్రకటనలో మండిపడ్డారు. సభకోసం పరీక్షలను వాయిదా వేయకూడదని ఈ ఫస్ట్‌క్లాస్ స్టూడెంట్‌కు తెలియపోవడం శోచనీయమన్నారు. బహిరంగ సభకు జనాలకు తరలించేందుకు బస్సులు కావాలనే ఉద్దేశంతో పరీక్షలు వాయిదావేయడం విద్యావ్యవస్థలో ప్రమాద ఘంటికలకు సూచన అని విమర్శించారు. ప్రతి ఏటా డీఎస్సీ అని ప్రతిపక్షనేతగా నిరుద్యోగులకు హామీలిచ్చి నిలువునా మోసం చేశాడన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 50,892 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలుంటే 6100 పోస్టులకే నోటిఫికేషన్ ఇవ్వడం నిరుద్యోగులను వంచించడమేనన్నారు. మాట తిప్పి మడమతిప్పిన జగన్‌రెడ్డికి రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని పల్లె ప్రకటనలో తెలియచేశారు.



నిరుద్యోగులకు మరోసారి మోసం

ప్రభుత్వ తీరుపై పరిటాల శ్రీరామ్ ఆగ్రహం

డీఎస్సీ పేరుతో రాష్ట్రంలో నిరుద్యోగుల్ని మరోసారి మోసం చేయాలని సీఎం జగన్ చూస్తున్నారని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్ మండిపడ్డారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రతిఏటా మెగా డీఎస్సీ విడుదల చేస్తామని చెప్పిన జగన్ ఈ నాలుగేళ్లు నిరుద్యోగులను మోసం చేశారని విమర్శించారు. ఇప్పుడు ఎన్నికలు వస్తున్న వేళ డీఎస్సీ పేరుతో మరో మోసానికి తెరలేపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 21వేల ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉంటే 6100 పోస్టులతో నోటిఫికేషన్ ఇవ్వాలని కేబినెట్‌లో ప్రకటించడం నిరుద్యోగులను మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. 2019 ఎన్నికల ముందు 23వేల ఖాళీలు భర్తీ చేయడానికి మెగా డీఎస్సీ విడుదల చేస్తామని చెప్పి మోసం చేశారన్నారు. దీనిపై నిరుద్యోగులు నాలుగేళ్లుగా పోరాడుతున్నా ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. టీడీపీ హయాంలో కంపెనీలను తీసుకువస్తున్న సమయంలో ఆరునెలలు ముందు కొబ్బరికాయ కొట్టి ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించిన మీరు ఇప్పుడు రెండు నెలల ముందే మెగా డీఎస్సీ పేరుతో 6100 పోస్టులకు నోటిఫికేషన్ ఇస్తామనడం దగా కాదా అని నిలదీశారు.





ముదిగుబ్బలో రోడ్డుపై బైఠాయించిన రైతులు

కరెంటు కోసం రోడ్డెక్కిన రైతులు

జాతీయ రహదారిపై బైఠాయింపు

ముదిగుబ్బ, ఫిబ్రవరి 3: వ్యవసాయ విద్యుత్ కోసం రైతులు రోడ్డెక్కారు. మండలంలోని గుంజేపల్లి విద్యుత్ ఫీడర్ కింద ఉన్న గుంజేపల్లి, గుడ్డంపల్లి తండా, పొడరాళ్లపల్లి, రామస్వామితండా, పూజారితండా, పాతూరుకు చెందిన రైతులు శనివారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా జాతీయరహదారిపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. గుంజేపల్లి విద్యుత్ ఫీడర్ పరిధిలోని రైతులు వేరుశనగ, జొన్న, టమోటా, కలింగర, ఇతర పంటలు సాగుచేశారు. నాలుగు రోజులనుండి వ్యవసా యానికి విద్యుత్ సక్రమంగా సరఫరా చేయట్లేదని, దీంతో పంటలు ఎండిపోతు న్నాయని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పులుచేసి పంటలు సాగుచేశామని, పంట చేతికి రాకపోతే ఆత్మహత్యలే శరణ్యమని ఆవేదన చెందారు. ట్రాన్స్‌కో అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా, స్పందించడంలేదని పేర్కొన్నారు. పోలీసులు రైతుల వద్దకు చేరుకొని, ధర్నాకు అనుమతి లేదని, వెళ్లిపోవాలని సూచించారు. విద్యుత్ అధికారులు ఇక్కడికి వచ్చి, సమస్య పరిష్కరించేవరకు వెళ్లే ప్రసక్తే లేదని రైతులు భీష్మించుకు కూర్చున్నారు. రైతులకు టీడీపీ నాయకుడు తుమ్మల మనోహర్, సీపీఐ నాయకుడు చల్లాశ్రీనివాసులు మద్దతు తెలిపారు. సీఐ యతీంద్ర కదిరి విద్యుత్ ఏడీ కి సమాచారం ఇవ్వడంతో, ఏడీ బాలసుబ్రహ్మణ్యం ధర్నా వద్దకు చేరుకొని, రైతులతో మాట్లాడారు. మూడురోజుల్లో సమస్యను పరిష్కరిస్తామన్నారు. లోవోల్టేజ్ సమస్య కూడా లేకుండా చేస్తామని, రాళ్లఅనంతపురం సబ్‌స్టేషన్, మారాల సబ్‌స్టేషన్‌ల నుండి రైతులకు ప్రత్యామ్నాయంగా విద్యుత్ సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు వెనుదిరిగారు.



విద్యుత్ అధికారులను నిలదీస్తున్న రైతులు

ఉత్తుత్తి బటన్!

నేటికీ ఖాతాల్లో జమ కాని ఆసరా నిధులు

- బ్యాంకుల చుట్టూ పొదుపు మహిళల ప్రదక్షిణ
- ఆసరా చెక్కుల పంపిణీ పేరుతో సభలు
- రాకుంటే డబ్బు రాదని బెదిరింపులు
- డ్వాక్రా సంఘాల సభ్యులపై తీవ్ర ఆంక్షలు





పుట్టపర్తి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి 12 రోజులు గడిచినా ఆసరా సొమ్ము పొదుపు సంఘాల్లో జమా కాలేదు. ఆసరా సొమ్ము కోసం మహిళా సంఘాల సభ్యులు బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఆసరా పథకంలో భాగంగా నాలుగో విడత కింద జిల్లాలోని 28127 సంఘాల్లోని 277571 మంది మహిళ సభ్యులకు రూ. 215.63 కోట్లు విడుదల చేశారు. గత నెల23న అనంతపురం జిల్లాలోని ఉరవకొండలో ముఖ్యమంత్రి జగన్ నిధుల విడుదల కోసం బటన్ నొక్కారు. అయితే డబ్బులు మాత్రం నేటికీ మహిళల ఖాతాల్లో జమకాలేదు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రచారాస్త్రంగా వినియోగించుకోవాలనే యోచన తో వైసీపీ అన్ని ప్రయత్నాలు చేస్తోంది. సొమ్ము జమకాకపోయిన ఎన్నికల ప్రచారం కోసం చెక్కుల పంపిణీ పేరుతో పట్టణాలతోపాటు ఆయా నియోజక నియోజక వర్గం కేంద్రంతోపాటు మండలాల్లో భారీ సభలు నిర్వహించేందుకు షెడ్యూల్ సిద్ధం చేస్తోం ది. ఈసభలకు పొదుపు సంఘాల్లోని ప్రతి సభ్యురాలు రావాల్సిందేనని ఉన్నతాధికా రుల నుంచి జిల్లా గ్రామీణాభివృద్ధి, మెప్మా శాఖల అధికార యంత్రాంగానికి ఆదేశాలందాయి. ఇప్పటికే ధర్మవరంలో ఆసరా సభలను నిర్వహించారు. అధికార పార్టీ పెద్దల మెప్పు కోసం ఆంక్షలు పెట్టి జిల్లా గ్రామీణాభివృద్ధి, మెప్మా శాఖల అధికారులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నా తీరు స్వయం సహాయక సంఘాల మహిళలల్ని ఆందోళనకు గురిచేస్తోంది.

సభల నిర్వహణ టెన్షన్

నియోజకవర్గ సమన్వయకర్తల మార్పు, చేర్పులతో వైసీపీ సిట్టింగ్ ఎంపీ, ఎమ్మెల్యేల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. హిందూపురం ఎంపీ, కదిరి, మడకశిర, పెనుకొండ అసెంబ్లీ నియోజకవర్గాల వైసీపీలో అసమ్మతి చల్లారడంలేదు. కొత్త సమన్వయకర్తలతో సిట్టింగ్ ఎమ్మెల్యే అనుచరవర్గం అంటీముట్టనట్లు వ్యవహ రిస్తున్నారు. అధిష్ఠానం ఆలోచనలు అంతుచిక్కక సిట్టింగులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. తామే బరిలో ఉంటామని పుట్టపర్తి, ధర్మవరం సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో ధీమా ఉన్నా, చివరి దాకా ఇదేమాట అనగలమా అనే గుబులు వారిలో కూడా ఉంది. ఈనేపథ్యంలో ఆయా నియోజకవర్గాల ఆసరా సభల నిర్వహణకు జన సమీకరణ మొదలు షెడ్యూల్ దాకా జిల్లా గ్రామీణాభివృద్ధి, మెప్మా శాఖలపై భారం పెడుతున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలను తప్పించి కొత్త సమన్వయకర్తలను నియమించడంతో సభల నిర్వహణ షెడ్యూల్ ఎవరిస్తారు? సభకు ఎవరిని పిలవాలన్న టెన్షన్‌తో అధికార యంత్రాంగం తలలుపట్టుకుంటున్నారు.

ఎన్నికల వేళ ప్రచారాస్త్రంగా..

నాలుగో విడత వైఎస్సార్ ఆసరా పథకం రుణమాఫీ పేరుతో జిల్లా గ్రామీణాభివృద్ధి, మెప్మా శాఖల అధికారులు చెక్కుల పంపిణీ పేరుతో సభలు నిర్వహిస్తున్నారు. పట్టణ, మండలాల్లో ఆయా నియోజకవర్గం అధికార పార్టీ ఎమ్మెల్యే, వైసీపీ సమన్వయ కర్తలతో ఈనెల 5నుంచి సభలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈసభలకు డ్వాక్రా సంఘాల్లో ఆసరా పథకం కింద రుణమాఫీ వర్తించే ప్రతి మహిళ రావాలని హుకుం జారీ చేశారు. సభ దగ్గరకు వచ్చి గ్రూప్ ఫొటోను అప్‌లోడ్ చేయాలన్న నిబంధన పెట్టారు. సభకు రాకుంటే రుణమాఫీ వర్తించదని బెదిరిస్తున్నారు. దీంతో గతేడాది వేసవిలో పడిన ఇబ్బందులను తలచుకుని పొదుపు సంఘాల మహిళలు ఆందోళన చెందుతున్నారు.

పురం వైసీపీలో ఇంటి పోరు

చక్కదిద్దేందుకు మంత్రి పెద్దిరెడ్డి యత్నం
వర్గ విభేదాలతో ఓటమి భయం!
మంత్రి పర్యటనకు ముఖ్యనేతల డుమ్మా

హిందూపురం, ఫిబ్రవరి 3: పురం వైసీపీని వర్గ విభేదాలు వెంటాడుతున్నాయి. ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్‌ని కాదని వైసీపీ సమన్వయకర్తగా దీపికను నియమించ డంతో సమస్య మొదలైంది. సమన్వయకర్త మార్పు విషయంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కీలక భూమి పోషించారు. అప్పటి నుంచి హిందూపురం వైసీపీ బాధ్యతను ఆయనే భుజాలపై వేసుకుని మోస్తున్నారు. ఈనేపథ్యంలో నియోజకవర్గం లోని వర్గ విభేదాలను చక్కదిద్దేందుకు మంత్రి రంగంలోకి దిగారు. గత నెలలో ఆరు రోజుల పాటు హిందూపురం రూరల్ మండలం, లేపాక్షి, చిలమత్తూరు మండలాల్లో పంచాయతీల వారిగా సమావేశాలు పెట్టారు. కానీ సమావేశాలకు నాయకుల మాటేమిటో గానీ, మహిళా సంఘాల సభ్యులు మాత్రమే హాజరయ్యారు.

పెద్దిరెడ్డి పర్యటనకు మూడు వర్గాలు దూరం

గత నెలలో మంత్రి పర్యటించినప్పుడు ఆగ్రోచైర్మన్ నవీన్‌నిశ్చల్ రెండు రోజుల పాటు మంత్రితో కలిసి వచ్చారు. మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాలరెడ్డి కూడా అక్కడక్కడ హాజరయ్యారు. కానీ ఈ సారి ఇద్దరి నేతలతో పాటు ఎమ్మెల్సీ వర్గంలోని ముఖ్యనాయకులు హాజరుకాలేదు. ఈ మూడు వర్గాలు దీపిక పాల్గొనే కార్యక్రమాలకు సైతం దూరంగానే ఉంటున్నాయి. మంత్రి శనివారం పర్యటిస్తున్నారని తెలిసి ఇతర కార్యక్రమాల పేరుతో ముఖ్యనేతలు తప్పించుకున్నట్లు సమాచారం. ఎమ్మెల్సీ వర్గంలోని మున్సిపల్ చైర్‌పర్సన్‌తో పాటు కొంతమంది మాత్రమే సమావేశానికి హాజరుకాగా, ముఖ్య నాయకులు అటువైపు చూడలేదు.



హిందూపురంలోని ఓ ఫంక్షన్ హాల్లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పురం వైసీపీలో మారని తీరు

వైసీపీ ఆవిర్భావం నుంచి హిందూపురంలో వర్గపోరు నెలకొని ఉంది. మహిళను సమన్వయకర్తగా నియమించి అందరినీ ఏకతాటిపైకి తెచ్చేందుకు మంత్రి యత్నిస్తున్నారు. ఆమె వచ్చిన కొద్ది రోజులు మాత్రం నాయకులు ఐకమత్యంగా ఉన్నట్లు కనిపించినా, లోలోపల మాత్రం వర్గపోరు సమిసిపోలేదు అనడానికి శనివారం మంత్రి పర్యటనే నిదర్శనం. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వైసీపీలో నెలకొన్న వర్గవిభేదాలు మంత్రికి తలనొప్పిగా మారాయి. పైకి మెజారిటీ సాధిస్తామని చెప్తున్నా లోలోపల మాత్రం ఓటమి భయం వెంటాడుతున్నట్లు తెలుస్తోంది. అందుకే స్థానిక వైసీపీ నాయకులను నమ్మలేక చిత్తూరు జిల్లాకు చెందిన ముఖ్యనేతలే పార్టీ వ్యవహారాలు చూస్తున్నట్లు సమాచారం.



ధర్మవరం తహసీల్దార్ కార్యాలయంలో డీటీతో వాదనకు దిగిన వీఆర్‌ఏలు

సిగరెట్లు, టిఫిన్లు ఇవ్వడానికేనా మేము?

డీటీపై భగ్గుమన్న వీఆర్‌ఏలు

- భోజనం వడ్డించలేదని డీటీ బూతుపురాణం
- ఎదురుతిరిగిన చిరుద్యోగులు
- ధర్మవరం తహసీల్దార్ కార్యాలయంలో ఘటన

ధర్మవరం రూరల్, ఫిబ్రవరి 3: అన్నం వడ్డించేందుకు ఎవరూ అందుబాటులో లేరని వీఆర్‌ఏలపై డిప్యూటీ తహసీల్దార్ బండబూతులతో విరుచుకుపడిన సంఘటన ధర్మవరం తహసీల్దార్ కార్యాలయంలో శనివారం జరిగింది. వివరాలు ఇలా.. కార్యాలయంలో డీటీ ఈశ్వరయ్య మధ్యాహ్న భోజనం తీసుకురావాలని వీఆర్‌ఏలను ఆదేశించారు. వారు భోజనం తెచ్చి డీటీ బెంచ్ వద్ద పెట్టి వెళ్లిపోయారు. తర్వాత కొద్ది సేపటికి భోజనం వడ్డించేందుకు వీఆర్‌ఏలు లేరా అని అక్కడున్న సిబ్బందిని డీటీ అడిగారు. ఎవరూ లేరని తెలపడంతో బండ బూతులతో తిట్లదండకం అందుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న వీఆర్‌ఏలు అంతా కార్యాలయం వద్దకు చేరుకుని వాగ్వా దానికి దిగారు. ఏమి రౌడీలమా, దాదాలమా, దొంగతనం చేశామా మీ ఇష్టాను సారంగా ఎలా మాట్లాడతారంటూ మండిపడ్డారు. ఆరు నెలలుగా నోటికొచ్చినట్లు వీఆర్‌ఏలను తిడుతున్నారు. ఇంకెన్నాళ్లు సహించాలి? జీతాలు అడిగితే చులకనగా మాట్లాడతారు, మీకు సిగరెట్లు, టిఫిన్లు, భోజనాలు తెచ్చేందుకే కార్యాలయానికి రావాలా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఎవరూ ఇలా హింసించలేదని మీరు వచ్చినప్పటి నుంచే ఇలా వెట్టి చాకిరీ మొదలైందని డీటీ తీరును ఎండగట్టారు. డీటీతో వీఆర్‌ఏల వాగ్వాదం వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. కాగా ఇప్పటికే పలుమార్లు డీటీ కార్యాలయ సిబ్బందితో కూడా ఇలానే ప్రవర్తించాడని, రెండురోజుల క్రితం కార్యాలయంలోని ఓ మహిళ అధికారిణి కార్యాలయానికి లేటుగా వచ్చారనే నెపంతో వాగ్వా దానికి దిగినట్లు తెలిసింది. ఆయన ఎప్పుడు, ఎలా ఉంటారోనని, ఆయన వద్దకు వెళ్లాలంటేనే భయాందోళన చెందుతున్నట్లు కార్యాలయ సిబ్బంది తెలిపారు.

ఈ విషయంపై డీటీ ఈశ్వరయ్యను అడగ్గా, వీఆర్‌ఏలు సరిగ్గా పనిచేయలేదని దండిస్తుంటామని, వారు తమ సిబ్బందే అని అన్నారు. 'మాకూ మాకు ఇలాంటివి తప్పవు. పనికట్టుకుని వీడియోను వైరల్ చేశారు' అని అన్నారు.

నాకే రూం లేదంటావా..?


జిల్లా విద్యాశాఖ అధికారిపై ప్రవీణ్‌ప్రకాష్ ఫైర్

హిందూపురం, ఫిబ్రవరి 3: 'నేనేమి ఫైవ్ స్టార్, సెవన్ స్టార్ హోటల్ అడగలేదు. లాడ్జిలో రూం చూడమంటే నాకే లేదంటావా' అంటూ విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ జిల్లా విద్యాశాఖ అధికారిపై చిందులు తొక్కినట్లు సమాచారం. శుక్రవారం అర్ధరాత్రి సమయానికి ఆయన హిందూపురం వచ్చారు. అక్కడే ఓ లాడ్జిలో రూం చెప్పాలని జిల్లా విద్యాశాఖ అధికారికి ప్రిన్సిపల్ సెక్రటరీ వద్ద ఉన్న అధికారులు చెప్పారు. దీంతో జిల్లా అధికారి మంత్రి పెద్దిరెడ్డి పట్టణంలోనే ఉన్నారని, దీంతో అక్కడ లాడ్జిలు ఖాళీ లేవని చెప్పినట్లు సమాచారం. దీంతో అప్పటికి ఏదో ఓ లాడ్జిలో ప్రవీణ్ ప్రకాష్ బస చేశారు. శనివారం ఉదయం తనని కలవడానికి వచ్చిన జిల్లా విద్యాశాఖ అధికారిపై అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. పట్టణంలో ఒక రూం అడిగితే ఇప్పించడానికి చేత కాదు. కుంటిసాకులు చెప్తావా అంటూ ఆగ్రహించినట్లు సమాచారం. దీనిని మనసులో పెట్టుకొని రోజంతా జిల్లా అధికారులపై చిర్రుబుర్రు లాడినట్లు అధికారులు గుసగుసలాడారు.

పడిపోయిన ఇంటికి పన్ను!

వృద్ధాప్య పింఛన్ నుంచి డబ్బు మినహాయింపు

రొద్దం, ఫిబ్రవరి 3: ఏడాది కిందట పడిపోయిన ఇంటికి సైతం కొత్తగా పన్ను విధించి ఔరా అనిపించారు ఓ పంచాయతీ అధికారులు. సాధారణంగా గ్రామీణ ప్రాంతాల్లో ఇంటి కొలతలను బట్టి పన్ను వసూలు చేస్తుంటారు. రొద్దం మండలం కందుకూర్లపల్లి గ్రామంలో వృద్ధుడు వెంకటప్ప పాత ఇల్లు ఏడాది కిందట వర్షాలకు పడిపోంది. దీంతో ఆయన వేరే చోటికి మారాడు. అయితే పాత ఇంటికి కొత్త పన్నును వసూలు చేయడంపై వృద్ధుడు వెంకటప్ప ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిబ్రవరి మాసంలో పంపిణీ చేసిన పింఛన్‌లో రూ.157 కోత విధించి మిగిలిన మొత్తాన్ని ఇవ్వడంపై మండిపడ్డారు. తన మొదటి కుమారుడు, భార్య అందరూ కలిసి రెండో కుమారుడు కట్టుకున్న ఇంటిలోకి మారామని అయినప్పటికీ సిబ్బంది కూలిపోయిన ఇంటికి పన్ను వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కందుకూర్లపల్లి గ్రామంలో సుమారు వంద పైబడి వృద్ధాప్య, దివ్యాంగ, వితంతు పింఛన్లు ఉన్నాయి. వారికి ఒక్కొక్కరికి రూ.200దాకా పింఛన్లలో కోత విధించారు. వలంటీర్లతో పింఛన్ పంపిణీ చేస్తూ వాటిలో నుంచే పన్ను రాబట్టడం పట్ల గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు.





ఇంటి పన్ను రసీదు , కందుకూర్లపల్లిలో పాత ఇంటికి పన్నువేశాడంటున్న వృద్ధుడు

సిత్రాలు సూడరో..!

- ఫొటోకు బదులుగా ఆధార్ కార్డు
- రెండు నియోజకవర్గాల జాబితాల్లో పేర్లు
- తప్పుల తడకగా ఓటర్ల తుది జాబితా

కదిరి, ఫిబ్రవరి 3: ఎన్నికల జాబితాలో చిత్రవిచిత్రాలు కనిపిస్తున్నాయి. కొందరు ఓటర్ల ఫొటోలకు బదులు ఆధార్ కార్డులను అప్‌లోడ్ చేశారు. మరికొందరికి రెండేసి నియోజకవర్గాల్లో ఓటు హక్కు కల్పించారు. ఒకే నియోజకవర్గంలో రెండు మూడు చోట్లా పేర్లను చేర్చారు.


ఫొటోలకు బదులు ఆధార్‌కార్డు అప్‌లోడ్ చేసిన జాబితా

● కదిరి పట్టణంలోని మారుతి నగర్ 67వ పోలింగ్ కేంద్రంలో సీరియల్ నంబర్లు 536, 555, 666, 669లో ఓటర్ల ఫొటో బదులుగా అధార్ కార్డును అప్‌లోడ్ చేశారు. 94వ పోలింగ్ కేంద్రంలో సీరియల్ నంబర్ 306లో డి.ఝన్సీ లక్ష్మీబాయి ఓటరుగా ఉన్నారు. ఈమె పేరును పుట్టపర్తి నియోజకవర్గం లోని 138 పోలింగ్ కేంద్రంలో సీరియల్ నంబర్ 463 కింద డుంగావత్ ఝూన్సీలక్ష్మీబాయిగా నమోదు చేశారు.

● పుట్టపర్తి నియోజకవర్గంలోని 139వ నంబరు పోలింగ్ కేంద్రంలో సీరియల్ నంబర్ 196 జయరామిరెడ్డి, 194లో వై.శివమ్మ, 197 రమేష్ కుమార్‌రెడ్డి, 195 త్రివేణి ఓటర్లుగా ఉన్నారు. వీరు కదిరి నియోజకవర్గం ఓటరు జాబితాలోనూ ఉన్నారు. 86వ పోలింగ్ కేం ద్రంలో సీరియల్ నంబర్ 223తో రమేష్ రెడ్డి, 82వ పోలిం గ్ కేంద్రంలో 419 సీరియల్ నంబర్‌తో త్రివేణి, 88 పోలింగ్ కేంద్రంలో సీరియల్ నంబర్ 305తో శివమ్మ, సీరియల్ నంబర్ 207తో జయరామిరెడ్డి ఓటర్లుగా నమోదు అయ్యారు.



కదిరి నియోజవర్గంలో ఓటర్లుగా నమోదు అయిన జాబితా

● కదిరి నియోజకవర్గంలోని 69 పోలింగ్ కేంద్రంలో 545 సీరియల్ నంబర్‌తో డి. జయలక్ష్మి, 543 సీరియల్ నంబర్‌తో రజని సాయితేజ, 541 సీరియల్ నంబర్‌తో పురుషోత్తం పేర్లు నమోదు అయ్యాయి. పుట్టపర్తి నియోజకవర్గంలోని 140వ పోలింగ్ కేంద్రంలో 389, 384, 385 సీరియల్ నంబర్లతో వీరి పేర్లే ఉన్నాయి.

● గాండ్లపెంట మండలంలోని 162, 163 పోలింగ్ కేంద్రాల పరిధిలో పోత చైతన్య కుమార్‌రెడ్డి, పోత శ్రావణ్‌కుమార్‌రెడ్డి పేర్లు ఉన్నాయి.

తప్పుల తడకగా ఓటరు జాబితా

కణేకల్లు, ఫిబ్రవరి 3: మండలంలో పూలచెర్ల గ్రామంలో వెలువడిన ఓటరు జాబితా తప్పుల తడకగా ఉన్నట్లు ఓటర్లు ఆరోపించారు. స్థానిక బీసీ కాలనీలో దాదాపు 15 మందికి ఓటరుజాబితాలో మండలం పేరు స్థానంలో కణేకల్లు ఉండాల్సి ఉండగా కళ్యాణదుర్గం మండలంగా నమోదైంది. ప్రధానంగా 138వ బూత్‌లో ఇలాంటి తప్పులు దొర్లాయి. అలాగే ఓటరు కార్డులో ఓటరు ఫోటో బదులు ఆధార్‌కార్డును ముద్రించారు. ఇలా 138వ బూత్‌లో ఓటరుజాబితాలో అనేక తప్పులు దొర్లడంతో ఓటర్లు తికమకకు గురవుతున్నారు. వెంటనే వాటిని సరిచేయాలని ఓటర్లు అధికారులను కోరుతున్నారు.


ఓటరు ఫొటో బదులు ఆధార్‌కార్డు వచ్చిన దృశ్యం

సైబర్ నేరగాళ్లను పట్టేసిన పోలీసులు

- బిహార్‌కు చెందిన ఇద్దరు సైబర్ నేరస్థుల అరెస్ట్
- రిజిస్ట్రార్ ఆఫీసుల వెబ్‌సైట్ల ఆధారంగా...
- 3నెలల కాలంలో 300బ్యాంకు ఖాతాల నుంచి రూ. 39.48లక్షల కాజేసినట్లు లావాదేవీల గుర్తింపు



అరెస్ట్ వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ అన్బురాజన్

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 3: సైబర్ నేరగాళ్లను అనంతపురం పోలీసులు పట్టుకున్నారు. బీహార్‌కు చెందిన ఇద్దరు సైబర్ నేరస్తులను అరెస్ట్ చేశారు. ఏఈపీఎస్(ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్ సిస్టమ్)ద్వారా ప్రజల బ్యాంకు ఖాతాల నుంచి డబ్బు నొక్కేస్తున్నట్లు నిర్ధారించారు. మూడు నెలల కాలంలో ఈ ముఠా సభ్యులు 300 మంది బ్యాంకు ఖాతాల నుంచి రూ.39,48,304 కాజేసినట్లు గుర్తించారు. 13 నెలల నుంచి ఎన్‌సీఆర్‌పీ, 1930 నెంబర్లకు జిల్లా నుంచి 1484 ఫిర్యాదులు, ప్రజల ఖాతాల నుంచి రూ.2,16,26,472 సైబర్ నేరగాళ్లు మాయం చేసినట్లు తేల్చారు. ఇదివరకు జమ్ముకశ్మీర్, తమిళనాడు, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్‌లలో దాక్కున్న సైబర్ నేరగాళ్లను అరెస్ట్ చేశారు. జిల్లా ఎస్పీ అన్బురాజన్ అరెస్ట్ వివరాలను వెల్లడించారు. బీహార్ రాష్ట్రం పూర్ణియ జిల్లా మహరాజ్పూరకు చెందిన నూర్ ఇస్లాం, పూర్ణియ జిల్లాకు చెందిన మహమ్మద్ ఇస్రాఫిల్‌లను అరెస్ట్ చేశారు. పూర్ణియ జిల్లాకే చెందిన జబ్బుద్దిన్ పరారీలో ఉన్నాడు.

ముఠా సైబర్ నేరాలకు పాల్పడిన తీరు...

ఈ ముఠా సభ్యులు రిజిస్టర్ ఆఫీసుల వెబ్‌సైట్ల ద్వారా డాక్యుమెంట్లను డౌన్‌లోడ్ చేసుకుంటారు. వీటిలో ఉన్న ఫింగర్‌ప్రింట్స్ ఆధార్ కార్డు నంబర్లను సేకరిస్తారు. విదేశాల నుంచి తెప్పించుకున్న కొన్ని కెమికల్స్ ఉపయోగించి బాధితుల వేలి ముద్రలు పోలిన నకిలీ వేలిముద్రల నమూనాను తయారు చేసుకుంటారు. ఏఈపీఎస్ యంత్రాన్ని సిద్ధం చేసుకుని తద్వారా బాధితుడికి సంబంధించిన నకిలీ వేలిముద్రలు, ఆధార్ నెంబర్ సహాయంతో, ఆధార్ నెంబర్‌తో అనుసంధానించిన బాధితుల బ్యాంకు ఖాతాల నుంచి రూ.10వేల చొప్పున సుమారు 300 మంది బ్యాంకు ఖాతాల నుంచి రూ.39,48,304 కాజేశారు. ఈ సొమ్మును ప్రస్తుతం అరెస్టయిన ఇద్దరితో పాటు పరారీలో ఉన్న నిందితుడు కలిసి సమానంగా పంచుకున్నారు. ఎట్టకేలకు వారిలో ఇద్దరిని పట్టుకున్నారు.

ఇదేం పద్ధతి రెడ్డీ!


అడుగంటిన పీఏబీఆర్

- జలవనరుల శాఖ అధికారులపై ఇన్‌చార్జి మంత్రి ఒత్తిడి
- జిల్లా జలాశయాలు నింపకముందే చిత్తూరుకు కృష్ణా జలాల తరలింపు
- అడుగంటిన స్థానిక రిజర్వాయర్లు ● ఉమ్మడి జిల్లాకు పొంచి ఉన్న నీటి ముప్పు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 3: జిల్లా ఇన్‌చార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఒత్తిడితో జిల్లాలో రిజర్వాయర్లు నిండకముందే కృష్ణా జలాలను చిత్తూరు జిల్లాకు తరలించారు. దీంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో తాగునీటి కష్టాలు తప్పేలా లేవు. జలవనరుల శాఖ అధికారులు, ఇంజనీర్లకు ముందుచూపు కొరవడటం, జిల్లా ప్రజాప్రతినిధులు ప్రశ్నించకపోవడం కూడా నీటి సమస్యకు ఓ కారణమే. రిజర్వాయర్లలో ఉన్న నీటి నిల్వలే ఈ విషయాన్ని చెబుతున్నాయి. ఇప్పటికే వందలాది గ్రామాల్లో తాగునీటి సమస్య ఉంది. జిల్లాలో తాగునీటికి ప్రధాన నీటి వనరుగా ఉన్న పీఏబీఆర్‌లో నీటి నిల్వ సాధారణం కంటే దిగువకు చేరింది. పీఏబీఆర్ నీటి నిల్వ సామర్థ్యం 11టీఎంసీలుగా కాగా ప్రస్తుతం 1.925టీఎంసీలు మాత్రమే ఉండటం ఆందోళన కలిగించే అంశం. జిల్లాలోని రిజర్వాయర్లను నింపకముందే జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఒత్తిడితో కృష్ణా జలాలను చిత్తూరు జిల్లాకు తరలించడమే నీటి ఎద్దడికి ప్రధాన కారణమని తెలుస్తోంది. సాధారణంగా వేసవిలో తాగునీటి అవసరాల కోసం ఉమ్మడి జిల్లాకు 12టీఎంసీల వరకు నిల్వ ఉంచాలి. అయితే ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో ఉన్న రిజర్వాయర్లలో 6టీఎంసీలు మాత్రమే నీరు నిల్వ ఉంది. ప్రతి ఏటా ఉమ్మడి జిల్లాకు తాగునీటి ఎద్దడి నివారణకు కృష్ణా జలాలు మళ్లించేవారు. అయితే ఈ దఫా శ్రీశైలం డ్యాంలో నీటి నిల్వ తక్కువగా ఉండటంతో హంద్రీనీవాకు 40టీఎంసీలకు గాను 16టీఎంసీలే కేటాయించారు. దీంతో హంద్రీనీవా కింద ఉన్న జలశయాలు సైతం అడుగంటి పోయాయి.


జీడిపల్లి రిజర్వాయర్‌లోని గుంతల్లో ఉన్న నీరు

అడుగంటిన జలాశయాలు

జిల్లాలో ఉన్న రిజర్వాయర్లు అడుగంటిపోయాయి. వీటిలో జీడిపల్లి 1.68టీఎంసీల సామర్థ్యం కాగా ప్రస్తుతం 0.4టీఎంసీల నీరు మాత్రమే ఉంది. గొల్లపల్లి 1.91టీఎంసీలు కెపాసిటీ కాగా ప్రస్తుతం 1.1టీఎంసీలు, మారాల 0.45టీఎంసీలు సామర్థ్యం ఉండగా ప్రస్తుతం 0.2టీఎంసీలు, చెర్లోపల్లి 1.608టీఎంసీలు సామర్థ్యం కాగా ప్రస్తుతం 0.8టీఎంసీల నీరు నిల్వ ఉంది. వీటితో పాటు పేరూరు డ్యాం 1.810టీఎంసీల సామర్థ్యం కాగా ప్రస్తుతం 0.450టీఎంసీలు, భైరవానితిప్ప ప్రాజెక్ట్ 2.1టీఎంసీల సామర్థ్యం కాగా ప్రస్తుతం 0.250టీఎంసీలు, చాగల్లు రిజర్వాయర్ 1.5టీఎంసీలుగా కాగా ప్రస్తుతం 0.65టీఎంసీలు, పెండేకల్లు 0.655టీఎంసీలుగా కాగా ప్రస్తుత 0.160టీఎంసీలు, పెనకచెర్ల డ్యాం (ఎంపీఆర్) 5.200టీఎంసీల సామర్థ్యం కాగా ప్రస్తుతం 0.429టీఎంసీలు, పీఏబీఆర్ డ్యాం 11,10టీఎంసీల సామర్థ్యం కాగా ప్రస్తుతం 1.925టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది.

నీరు తక్కువగా ఉన్న మాట వాస్తవమే

జిల్లాలో హంద్రీనీవా, హెచ్చెల్సీ పరిధిలోని జలాశయాల్లో ఆశించిన స్థాయిలో నీటి నిల్వలు లేని మాట వాస్తవమే. తుంగభద్ర డ్యాం, శ్రీశైలం డ్యాంల నుంచి ఈ దఫా హెచ్చెల్సీ, హెచ్‌ఎన్ఎస్ఎస్ కాలువలకు కేటాయింపులు తక్కువే. జిల్లాకు నీరు వచ్చింది తక్కువే. ప్రాజెక్టుల పరివాహక ప్రాంతాలలో వర్షాలు తక్కువగా రావడంతో కేటాయింపుల్లోనూ కోతలు విధించారు. దీంతో ఉమ్మడి జిల్లాకు సరిపడ సాగు, తాగునీరు అందుబాటులోకి రాలేదు. అయినా వేసవిలో నీటి ఎద్దడి సమస్య రాకుండా ఉన్న నీటిని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నాం.

- దేసేనాయక్, రాజశేఖర్, హంద్రీనీవా, హెచ్చెల్సీ ఎస్ఈలు

అవినీతి మొక్కలు

- పైసలిస్తేనే పండ్ల మొక్కలకు పేమెంట్!
- సుమారు రూ. 25 లక్షల బిల్లులు పెండింగ్
- డబ్బులు ఇవ్వలేదని ఆపేసిన ఉపాధి సిబ్బంది
- అధికారుల చుట్టూ రైతుల ప్రదక్షిణ


కళ్యాణదుర్గం మండలంలో సాగు చేసిన చీనీ మొక్కలు

కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 3: కొందరు ఉపాధి సిబ్బంది నిర్లక్ష్యం, అవినీతికి రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పైసలిస్తేనే పండ్ల మొక్కలకు పేమెంట్ చేస్తాం...లేకపోతే చేయమని చెబుతున్నట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. ఇలా రైతులకు సంబంధించిన రూ. 25 లక్షల వరకు బిల్లులను అప్‌లోడ్ చేయకుండా పెండింగ్ పెట్టేశారు. ఉపాధి పథకం కింద పండ్ల తోటల రైతులకు గతంలో ఎన్నడూ లేని విధంగా మెటీరియల్ కాంపొనెంట్ కింద గత అక్టోబరు వరకు వారానికి ఒకసారి రైతుల ఖాతాల్లోకి బిల్లులు జమ అయ్యాయి. నవంబరు నుంచి నిధుల లేమితో బిల్లులు ఆగిపోయాయి. బిల్లులు క్రమం తప్పకుండా పడుతున్నప్పుడే పేమెంట్ చేసి ఉంటే రైతులకు ప్రయోజనం చేకూరేది. కనీసం ఇప్పటికైనా బిల్లులను చేశారా అంటే అదీ లేదు. రకరకాల నిబంధనలను పెట్టి రైతులకు డబ్బులు రాకుండా అడ్డుకుంటున్నారు. పథకం కింద ఆరునెలల కిందట మొక్కలు నాటి సంరక్షణ చర్యలు చేపడుతున్నా నేటికి పేమెంట్ చేయకుండా ఉపాధి సిబ్బంది రైతులకు చుక్కలు చూపిస్తున్నారు. కళ్యాణదుర్గం మండలంలో 2022-23 వ ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం కింద 30 మంది, 2023-24లో 37 మంది రైతులు పండ్లతోటల పెంపకం కింద మామిడి, చీనీ, దానిమ్మ తదితర మొక్కలను సాగు చేశారు. వీరికి క్రమం తప్పకుండా నెలకోసారి నీరు, ఎరువులు, దున్నకం తదతర బిల్లులను చేయాల్సి ఉంటుంది. తీవ్ర కరువు నేపథ్యంలో రైతులు ఎన్నో వ్యయప్రయాసాలతో మొక్కలకు నీటి తడులు ఇచ్చి పంటను కాపాడుకుంటున్నారు. బిల్లుల కోసం ఉపాధి హామీ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా సిబ్బంది కనికరించడం లేదు. గత అక్టోబరు వరకూ వారానికోసారి బిల్లులు పడినా, అప్పుడు పేమెంట్ చేయకపోవడంతో రైతులు నష్టపోయారు. ఇప్పటివరకు జనవరిలో తిమ్మసముద్రం పంచాయతీలో 9 మంది రైతులు, మానిరేవులో నలుగురు, గోళ్లలో ఇద్దరు, బోరంపల్లి, గరుడాపురం, కొత్తూరు, ముద్దినాయనపల్లిలో ఒక్కొక్కరి చొప్పున కేవలం 19 మంది రైతులకు ఈ ఏడాది జనవరిలో పేమెంట్ చేశారు. ఇప్పటివరకు రైతులకు మెటీరియల్ కాంపొనెంట్ కింద రూ.7.80 లక్షల పేమెంట్ చేశారు. గత ఏడాది మార్చి నుంచి ఇప్పటివరకు 45 మంది రైతులకు ఒక్కరూపాయి కూడా పేమెంట్ చేయలేదు. తమకు పేమెం ట్ చేయాలని రైతులు మొరపెట్టుకుంటున్నా ప్రయోజనం లేకుం డా పోతోంది.

డబ్బులు అడుగుతున్నారన్నది అవాస్తవం
- రామచంద్ర రెడ్డి, ఇన్‌చార్జ్ ఏపీవో, కళ్యాణదుర్గం

పండ్లమొక్కల బిల్లులు చేయడానికి డబ్బులు అడుగుతున్నారన్నది పూర్తిగా అవాస్తవం. ఏదైనా సమస్య ఉంటే స్వయంగా పండ్ల మొక్కల రైతులే ఎంపీడీవోకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చు. జనవరి వరకు పూర్తిస్థాయిలో పండ్లమొక్కలకు బిల్లులను అప్‌లోడ్ చేశాం.

మంత్రి ఉష శ్రీచరణ్‌కు సొంతపార్టీలో సెగ

- పెనుకొండ నియోజకవర్గంలో సహకరించని కార్యకర్తలు
- సోమందేపల్లి మండలం చాలకూరులో ఫ్లెక్సీల చించివేత


చాలకూరులో మంత్రి ఫ్లెక్సీలను చించేస్తున్న సర్పంచ్ వర్గీయులు

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 3: 'ఎన్నికల బదిలీపై పెనుకొండ నియోజకవర్గానికి వెళ్లిన మంత్రి ఉష శ్రీచరణ్‌కు సొంతపార్టీవారు చుక్కలు చూపిస్తున్నారు. ఒకరి వద్దకు వెళితే మరొకరు అలుగుతున్నారు. ఓ గ్రామ పంచాయతీలో నాయకులు 'మేం కావాలా..? వారు కావాలా..?' అని పేచీకి దిగడంతో మంత్రి ఏకంగా గంటపాటు నడిరోడ్డుపై కాన్వాయ్ నిలబెట్టుకుని తంటాలు పడాల్సి వచ్చింది. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గంలో మంత్రి పర్యటిస్తున్నారు. ఆత్మీయ పలకరింపు పేరిట సోమందేపల్లి మండలంలోని చాలకూరు పంచాయతీకి శనివారం వెళ్లారు. చాలకూరులో భోజన విరామం అనంతరం అసమ్మతి నాయకురాలు అశ్వర్థమ్మ ఇంటికి మంత్రి బయలుదేరారు. దీనికి నిరసనగా మంత్రి వాహనం నుంచి సర్పంచ్ భర్త లక్ష్మీనరసప్ప మధ్యలోనే దిగిపోయారు. తమను కాదని, వ్యతిరేకుల వద్దకు మంత్రి వెళ్లడంతో సర్పంచ్ లలితమ్మ, ఆమె భర్త లక్ష్మీనరసప్ప, వారి అనుచరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ కోసం కష్టపడి, తాము ఎంతో నష్టపోయామని అన్నారు. మంత్రి పర్యటనకు జనాన్ని సమీకరించి, నాయకులకు ఏర్పాట్లు చేసిన తమను కాదని.. పార్టీకి వ్యతిరేకించేవారి ఇంటికి మంత్రి ఎలా వెళతారని మండిపడ్డారు. గ్రామంలో మంత్రికి స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చించివేశారు. పంచాయతీ పరిధిలో మంత్రి పర్యటనకు వచ్చేది లేదని, అసమ్మతి నాయకురాలు అశ్వర్థమ్మతోనే కలిసి ఆత్మీయ పలకరింపు కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. విభేదాలకు కారణాలేమిటో, ఎలా సర్దుబాటు చేయాలో తెలియక సుమారు గంటపాటు చాలకూరు సమీపంలోని రోడ్డుపై మంత్రి తన వాహనంలో ఉండి మంతనాలు జరిపారు. జెడ్పీటీసీ డీసీ అశోక్, వైసీపీ మండల మాజీ కన్వీనర్ వెంకటరత్నం, పోలీసులు సర్పంచ్ వర్గీయులకు నచ్చజెప్పినా వినలేదు. దీంతో చేసేది లేక చాలకూరు పంచాయతీ పరిధిలోని గుడ్డం నాగేపల్లి గ్రామానికి మంత్రి వెళ్లకుండా, బాపనపల్లి పంచాయతీకి వెళ్లారు. మంత్రి పర్యటనలో వివాదాలను చిత్రీకరిస్తున్న ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ విలేకరిపై మంత్రి తన గన్‌మెన్‌ను ఉసిగొల్పారు. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ విలేకరి సెల్‌ఫోన్‌ను గన్‌మెన్ లాక్కుని, వీడియోలు డిలీట్ చేసే ప్రయత్నం చేశారు. మంత్రి పర్యటన దృశ్యాలను చిత్రీకరించడం తమ విధిలో భాగమని, ఇలా వ్యవహరించడం తగదని తోటి విలేకరులు అభ్యంతరం చెప్పడంతో వెనక్కు తగ్గారు.


చాలకూరు వద్ద రోడ్డుపై మంత్రి వాహనం

ఎప్పటిలానే రుస రుస!

- టీచర్లపై విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఆగ్రహం
- హిందూపురంలో పాఠశాలల తనిఖీ
- ఎస్ఏ-3 పేపర్లు దిద్దకపోవడంపై ఆగ్రహం
- డీఈఓ, డీవైఈఓ, ఎంఈఓల పనితీరుపై అసహనం


ఖాళీగా ఉన్న రికార్డు పుస్తకాలను విద్యాశాఖ అధికారులకు చూపుతున్న ప్రవీణ్ ప్రకాష్

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 3: 'వేలకు వేలు జీతాలు తీసుకుంటున్నారు. అలాంటపుడు విద్యార్థులకు నాణ్యమైన విద్య ఎందుకు అందించరు? దేశంలో ఏ ప్రైవేట్ పాఠశాలలో కూడా ఉపాధ్యాయులకు రూ.50 వేలు జీతాలు ఇవ్వడంలేదు. మన రాష్ట్రంలో ప్రభు త్వ ఉపాధ్యాయులకు రూ.50 వేలపైనే జీతాలు అందుతున్నాయి. అలాంటప్పుడు బాధ్యతగా ఎందుకు పని చేయడం లేదు' అని ఎప్పటిలాగే ఉపాధ్యా యులపై విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రవీణ్‌ప్రకాష్ మండిపడ్డారు. హిందూపురంలో శనివారం ఆయన పలు పాఠశాలలు తనిఖీ చేశారు. పట్టణంలోని నేతాజీ మునిసిపల్ హైస్కూ ల్, పళనీనగర్‌లోని ప్రకాశం పంతులు ప్రాథమిక పాఠశాల, రూరల్ మండలంలోని సంజీవరాయనపల్లి ప్రాథమిక పాఠశాల, అనంతరం పట్టణ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలను ఆయన తనిఖీ చేశారు. ముందుగా మడకశిర, రొళ్ల, అగళి మండలాల్లో పర్యటిస్తారని సమాచారం. అయితే శుక్రవారం రాత్రి హిందూపురంలో ఉంటారని డీఈఓ మీనాక్షికి ఫోన్ వెళ్లడంతో బస ఏర్పాట్లు చేశారు. ఉద యం హిందూపురంలోనే తనిఖీలు చేస్తానని ఉన్న ఫలంగా చెప్పి నేతాజీ పాఠశాలకు వెళ్లారు. అక్కడ పాఠశాల తనిఖీ చేసి 8, 9 తరగతుల ఉపాధ్యాయులతో మాట్లాడారు. జనవరి 23 నుంచి 26 వరకు ఎస్ఏ 3 పరీక్షలు జరిగాయి. ఫిబ్రవరి 3వ తేదీ లోపల పరీక్షల పేపర్లు దిద్ది మార్కులు రికార్డు చేయాల్సి ఉంది. ఉపాధ్యాయు లు రికార్డులు సక్రమంగా నిర్వహించలేదని వారిపై ఆగ్ర హం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు ఏమిచేస్తున్నారో చూడాల్సిన బాధ్యత మీకు లేదా అని సంబంధిత ఎంఈఓ, డీవైఈఓ, డీఈఓలపై ఆగ్రహం వ్యక్తం చే శారు. హిందూపురంలో ఎంఈఓ గా ఎనిమిదేళ్లు పని చేసి కూడా బాధ్యతగా నడుచుకోలేదని ఎంఈఓ గంగప్పపై ఫైర్ అయ్యాడు. వర్కు బుక్కులు ఖాళీగా ఉండటంతో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు క్లాస్ పీకారు. ఆయన వెంట సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, ఆర్జేడీ వెంకట క్రిష్ణారెడ్డి, శ్రీసత్యసాయి జిల్లా డీఈఓ మీనాక్షి, డీవైఈఓ రంగస్వామి, ఎంఈఓ గంగప్పతో పాటు లేపాక్షి, చిలమత్తూరు ఎంఈఓలు ఉన్నారు.

వైసీపీ ఆవిర్భావానికి చంద్రబాబే కారణం

● మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి


విలేకరులతో మాట్లాడుతున్న పెద్దిరెడ్డి

హిందూపురం, ఫిబ్రవరి 3: వైసీపీ ఆవిర్భావానికి చంద్రబాబే మూల కారణమని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. పీసీసీ అధ్యక్షురాలు షర్మిలను తమ పార్టీకి శత్రువుగానే భావిస్తామని అన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురంలో వార్డులవారీగా జరిగిన పార్టీ సమీక్షా సమావేశాలకు శనివారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు కుట్రలో భాగంగానే జగన్‌ను షర్మిల విమర్శిస్తున్నారని ఆరోపించారు. షర్మిల మాట్లాడిన మొదటిరోజే తాను ఈ విషయం చెప్పానని గుర్తు చేశారు. రాష్ట్రం విడిపోవడానికి, వైఎస్ఆర్ కుటుంబంలో చిచ్చు రేగడానికి, చివరకు వైసీపీ ఆవిర్భావానికి కూడా చంద్రబాబే కారణమని అన్నారు. కాంగ్రెస్ ఒకప్పుడు బలంగా ఉండేదని, ఇప్పుడు ఆ పార్టీ చచ్చిపోయిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ శవాన్ని రఘువీరారెడ్డి, షర్మిల, కేవీపీ రామచంద్రరావు, గిడుగు రుద్రరాజు అనే నలుగురు మోస్తున్నారని ఎద్దేవా చేశారు. ఆ శవం ముందు ఉట్టి పట్టడానికి మరొకరు ఉండవచ్చునని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ బతికి బట్టకట్టలేదని, ఆ పార్టీలోని వారంతా వైసీపీలో ఉన్నారని అన్నారు.

టీడీపీలోకి వంద కుటుంబాల చేరిక


టీడీపీలో చేరిన వారితో కందికుంట వెంకటప్రసాద్

కదిరి, ఫిబ్రవరి 3: పట్టణంలోని హమాలీ యూనియన్‌కు చెందిన వంద కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. పట్టణంలోని జీవిమాన్ సర్కిల్లో శనివారం నాయకులు ఫైవుడ్ ఇందాయత్ ఆధ్వర్యంలో నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్, సీనియర్ నాయకుడు పవన్‌కుమార్ రెడ్డి సమక్షంలో వారు చేరారు. కందికుంట వారికి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలందరికి టీడీపీ అండగా ఉంటుందని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఇందుకు ప్రతిఒక్కరూ సైనికుల్లా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు అల్ఫాముస్తఫా, మహబూబ్‌బాషా, నాయకులు బంగారు కృష్ణమూర్తి, డైమండ్ ఇర్షాన్, రొద్దం బషీర్, ఖతాబ్, హైదర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో టీడీపీకి పట్టం కట్టండి

- భవిష్యత్తుకు గ్యారెంటీలో ప్రజలను కోరిన టీడీపీ నాయకులు


2వ వార్డులో మినీమేనిఫెస్టో కరపత్రాలను అందజేస్తున్న టీడీపీ నాయకులు

ధర్మవరం, ఫిబ్రవరి 3: రానున్న ఎన్నికల్లో టీడీపీకి పట్టం కట్టాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమయ్య, పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్ ప్రజలను కోరారు. పట్టణంలోని 2వ వార్డులో శనివారం వారు నాయకులు, కార్యకర్తలతో కలిసి బాబుష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని పట్టణ ప్రచార కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కరపత్రాలు పంచుతూ చంద్రబాబు ప్రకటించిన మినీ మేనిఫెస్టో పథకాలను వివరించారు. అదేవిధంగా ప్రజల సమస్యలను నమోదు చేసుకున్నారు. తర్వాత మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే సమస్యలను పరిష్కరించే బాధ్యతను పరిటాలశ్రీరామ్ తీసుకుంటారని హామీ ఇచ్చారు. వైసీపీ పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. టీడీపీ అధికారం చేపట్టాక అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. కనుక ప్రజలు టీడీపీ విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాళ్లపల్లి షరీఫ్, శీలామూర్తి, జిలకరశీన, రావులచెరువు కుళ్లాయప్ప, మాబు, మాధవరెడ్డి, గంగారపు రవి, గోసల శ్రీరాములు, పల్లపు శివశంకర్, రాజ్‌కుమార్ నాయుడు, నాగేంద్ర, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

పాలపాటిదిన్నెలో ప్రత్యేక పూజలు


ప్రత్యేకాలంకరణలో ఆంజనేయస్వామి

నల్లచెరువు, ఫిబ్రవరి 3: మండలంలోని పాలపాటి దిన్నె ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. వేకువజామునే అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు పలు అభిషేకాలు, అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు, అర్చనలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. పలు భజన బృందాల ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలు జరిగాయి. భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ ఛైర్మన్ దేవింటి భాస్కర్ రెడ్డి, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కేతిరెడ్డికి ఓటమి భయం పట్టుకుంది

- అందుకే వాల్మీకులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారు
- విలేకరుల సమావేశంలో టీడీపీ వాల్మీకి సంఘం నాయకులు

ధర్మవరం, ఫిబ్రవరి 3: ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి వచ్చే ఎన్నికల్లో ఓటమి భయం పట్టుకుందని, అందుకే వాల్మీకులపై అక్రమ కేసులు పెట్టిస్తున్నారని టీడీపీ వాల్మీకి సంఘం సీనియర్ నాయకులు మద్దిలేటి, తలారి చంద్రమోహన్ బాబు, బోయ రవిచంద్ర పేర్కొన్నారు. గుట్టకిందపల్లిలో శనివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలో వాల్మీకులు తెలుగుదేశం వైపు అధికంగా ఉన్నారన్నారు. ఇందుకు గాను ఎమ్మెల్యే వారిపై కక్ష పెట్టి అక్రమ కేసులు పెట్టిస్తున్నారని అన్నారు. వారిని భయాందోళనకు గురి చేసి విధంగా కుట్ర పన్నుతున్నారన్నారు. పోలీసులు కూడా అధికార పార్టీ నాయకులు పెడుతున్న కేసులపై ఒక్కసారి ఆలోచించాలని, నిజానిజాలు తెలుసుకోవాలని కోరారు. అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గి కేసులు బనాయించడం సరి కాదన్నారు. ఇటీవల గుట్టకిందపల్లికి చెందిన వాల్మీకి నరేశ్ టీడీపీలోకి చేరుతారని అధికార పార్టీ నాయకులు పోలీసులపై ఒత్తిళ్లు తెచ్చి పీడీ యాక్టుకింద కేసు నమోదు చేయించారని తెలిపారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, సరైన సమయంలో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో టీడీపీ వాల్మీకిసంఘం నాయకులు బొట్టుకిష్ట, జింకలరాజన్న, చీమల రామాంజి, సాయి, చీమల నాగరాజు, అంకేదుర్గేశ్, పూలకుంట్ల మహేశ్ పాల్గొన్నారు.

రేషన్ పంపిణీలో అవకతవకలుండరాదు: జేసీ


ఎండీయూ వాహనాన్ని తనిఖీ చేస్తున్న జేసీ

పుట్టపర్తి రూరల్, ఫిబ్రవరి 3: చౌకదుకాణాల ద్వారా అందించే రేషన్ పంపిణీలో డీలర్లు ఎలాంటి అవకతవకలకు పాల్పడరాదని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కమార్ సూచించారు. మున్సిపల్ పరిధిలోని ఎనుమలపల్లిలో రేషన్ పంపిణీ చేసే ఎండీయూ వాహనాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డీలర్లు నిత్యావసర వస్తువుల పంపిణీలో ఎలాంటి అవకతకలకు పాల్పడకూడదన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే సరుకులు విక్రయించాలన్నారు. తూకాలలో మోసాలుండరాదన్నారు. అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. జేసీ వెంట డీఎస్ఓ వంశీకృష్ణారెడ్డి, సీఎస్‌డీటీ రమేష్, వీఆర్వోలు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయం పరిశీలన

బత్తలపల్లి, ఫిబ్రవరి 3: పంటల సాగులో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తే.. అధిక దిగుబడులు వస్తాయని రైతులు సూచించారు. మండలంలోని రాఘవంపల్లిలో చేపట్టిన ప్రకృతి వ్యవసాయాన్ని జర్మనీ బృందం శనివారం పరిశీలించింది. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయంలో ఏయే పదార్థాలు ఉపయోగిస్తారు. వాటిని ఎలా చేస్తారు అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. దీంతో స్థానిక రైతులు విత్తనశుద్ధి ఘన, జీవా మృతాలు చూపించి.. వాటి ఎలా వాడాలో వివరించారు. అలాగే జర్మనీ బృందం ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో సాగు చేసిన పంటలకు, రసాయన ఎరువులతో సాగు చేసే పంటలకు తేడాను అడిగి తెలుసుకున్నారు. రసాయన ఎరువుల సాగు కన్నా.. ప్రకృతి వ్యవసాయమే అధిక దిగుబడి ఇస్తుందని రైతులు వివరించారు. కార్యక్రమంలో జర్మనీ బృందం క్రిస్టోఫ్, అలెగ్జాండర్ లింగె తాల్, జోష్కా గ్రేవ్‌తో పాటు ప్రకృతి వ్యవసాయ మేనేజర్ లక్ష్మా నాయక్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.


రాఘవం పల్లిలో ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలిస్తున్న జర్మనీ బృందం

రాష్ట్ర స్థాయిలో జిల్లాకు మంచిపేరు తేవాలి

- క్రీడాకారులను కోరిన కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి రూరల్ ఫిబ్రవరి 3: ఆడుదాం ఆంధ్ర క్రీడాల్లో భాగంగా ఈనెల 9 నుంచి 16వ తేదీ వరకు విశాఖపట్టణంలో జరిగే రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ఉత్తమప్రతిభ కనబరచి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆకాంక్షించారు. జిల్లా కేంద్రంలోని సత్యసాయిసూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వై జంక్షన్‌లో శనివారం జరిగిన ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆడుదాం ఆంధ్రకీడా పోటీలను గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలలో ఎలాంటి ఆటంకాలు లేకుండా నిర్వహించిన అధికారులకు అభినందనలు తెలిపారు. జిల్లాలో గత డిసెంబరు 15నుంచి జనవరి 2వ తేదీ వరకు జరగిన వివిధ క్రీడా పోటీలలో 680 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. ఇందులో 120 మంది జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి లో వివిధ పోటీలకు అర్హత సాధించారన్నారు. ఈ క్రీడాకారులు విశాఖపట్టణంలో జరిగే రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ఉత్తమప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. అనంతరం విజేతలకు ట్రోఫీలను ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి ఉదయభాస్కర్, ఆర్డీఓ భాగ్యరేఖ, పీఈటీలు, క్రీడా సిబ్బంది పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి..

బుక్కపట్నం: క్రీడాకారులు గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలని కలెక్టర్ అరుణ్‌బాబు సూచించారు. ఆడుదాం ఆంధ్ర క్రీడల్లో భాగంగా మండలకేంద్రలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో బుక్కపట్నం జట్టు ఫైనల్‌కు చేరుకుంది. బుక్కపట్నం లీగ ల్స్ జట్టు, మడకశిర జట్టు తలపడగా, మడకశిర జట్టుపై బుక్కపట్నం జట్టు గెలిచి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. అనంతరం కలెక్టర్ విజేతలకు ట్రోఫీ, మెడల్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. రాష్ట్రస్థాయిలో ఈనెల 9న విజయవాడలో జరుగు పోటీల్లో బుక్కపట్నం జట్టు పాల్గొంటుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో భాగ్యరేఖ, సర్పంచ్ నాగలక్ష్మీరాజు, పీడీ నాగరాజు, కబడ్డీ కోచ్‌లు పాల్గొన్నారు.


పుట్టపర్తిలో విజేతలకు ట్రోఫీని అందిస్తున్న కలెక్టర్


బుక్కపట్నంలో..

మంత్రా.. మజాకా..!

- రహదారులకు అడ్డంగా వేదికలు
- ప్రయాణికులకు చుక్కలు
- సభకు రాకపోతే ఆసరా కట్ అంటూ బెదిరింపులు
- జనం వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు, సంఘాల లీడర్లు


రహమత్‌పురంలో రోడ్డుకు అడ్డంగా వేదిక

హిందూపురం, ఫిబ్రవరి 3: ఎవరేమనుకున్నా, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది వచ్చినా, మేమింతేనంటూ వైసీపీ నాయకులు మరోసారి నిరూపించుకు న్నారు. మంత్రా మజాకా అన్న రీతిలో సభా వేదికలు ఏర్పాటు చేయడంతో శనివారం పట్టణంలోని పలు రహదారుల్లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పట్టణంలోని ఏడుచోట్ల సమావేశాలు నిర్వహించారు. దీనికి రాష్ట్రమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరయ్యారు. దీంతో అధికారులు అత్యుత్సాహం వ్యవహరించి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగించారు. ఇదిచూసిన జనం తీవ్ర విమర్శలు చేశారు.

రహదారులకు అడ్డంగా వేదికలు

పట్టణంలో ఏడు చోట్ల శనివారం సమావేశాలు నిర్వహించారు. తెల్లవారు జామునుంచే మేళాపురం సర్కిల్‌లో ఓ వైపు రహదారికి అడ్డంగా వేదిక ఏర్పాటు చేయడంతో రోడ్డు బ్లాక్ చేశారు. దీంతో రాకపోకలు ఒకవైపే జరిగాయి. దీనివల్ల ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్ప డింది. ఆ తరువాత కేవీఆర్ ఫంక్షన్‌హాల్‌వద్ద వాహనాలు అడ్డంగా పెట్టడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. చర్చిగ్రౌండ్‌వద్ద, రహమత్‌పురం రైల్వే స్టేషన్‌కు వెళ్లేదారిలో, పీడి రోడ్డులో వేదిక ఏర్పాటు చేయడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆదారిలో రాకపోకలు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అయితే దీనిపై తీవ్ర విమర్శలు చేసినా వైసీపీ నాయకులు మాత్రం మేమింతే నని నిరూపించుకున్నారు. ప్రజా సమస్యలపై ఐదు నిమిషాలు రోడ్డుపై బైఠాయి స్తామంటే అనుమతులు లేవని, 30యాక్ట్ అమలులో ఉందని పోలీసులు చెబు తారు. అలాంటిది పోలీసులే రోడ్డుపై ఉండి ట్రాఫిక్‌ను మళ్లించడం ఎంతవరకు సమంజసమని ప్ర యాణికులు ప్రశ్నించారు. పోలీసులు స్వామిభక్తిని చాటు కున్నారు. చంద్ర బాబు అరెస్ట్ నేపథ్యంలో రోడ్డుపై ర్యాలీగా వెళ్తుంటే అరెస్ట్‌చేసిన పోలీసులు శనివారం పట్టణంలోని పలు రహదారులకు అడ్డంగా వేదిక ఏర్పాటు పట్ట ఏం సమాధానం చెబుతారని ప్రతిపక్షాలు ప్రశ్నించాయి. రోడ్డుకు అడ్డంగా వేదిక ఏర్పాటుచేసి ప్రయాణికులకు చుక్కలు చూపించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చినవారు పట్టణంలో పలుచోట్ల తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

ఆసరా కట్ అంటూ బెదిరింపులు

మంత్రి సమావేశానికి కనీసం ఐదేసి వార్డులకు వంద మంది కూడా రాలేదు. కేవలం మహిళా సంఘాల సభ్యులతోనే సమావేశాలు నిర్వహించారు. పట్టణం లో మహిళా సంఘాల లీడర్లు శుక్రవారం నుంచే సభ్యులతో సమావేశమై మం త్రి కార్యక్రమానికి రాకపోతే ఆసరా పడదని, చెక్కులు చేయమని బెదిరించారు. ఎవరెవరు వస్తారో వారి పేర్లు నమోదు చేసుకుంటామని రానివారికి ఆసరా కట్ చేయిస్తామని బెదిరించారు. దీంతో చేసేదిలేక మంత్రి సమావేశానికి సంఘాల సభ్యులు హాజరయ్యారు. పట్టణంలో ఏడు చోట్ల జరిగిన కార్యక్రమాలకు మహి ళా సంఘాల సభ్యులే తప్ప వైసీపీ శ్రేణులు హాజరుకాకపోవడం విశేషం.

సమావేశం ప్రారంభం కాగానే వెళ్లిపోయిన మహిళలు

సమావేశం ప్రారంభమైన వెంటనే మహిళలు వెళ్లిపోవడం కనిపించింది. మేళాపురం సర్కిల్‌లో సమావేశం ప్రారంభమైన ఐదు నిమిషాలకే ఒక్కొక్కరు లేచి వెళ్లిపోయారు. మంత్రి మాట్లాడే సమయానికి జనం అంతంతమాత్రమే ఉండటంతో ప్రతిచోట మంత్రి ఐదు నిమిషాలలోపే మాట్లాడారు. జనం వెళ్లిపో తుండటంచూసి సబ్ డివిజనల్ అధికారి జనం వెళ్లిపోకుండా అడ్డుకోవాలని రోడ్డుకు అడ్డంగా బోర్డులు పెట్టించారు. ఎస్‌ఐ వచ్చి జనాన్ని వెళ్లిపోకుండా అడ్డుకోవడం కనిపించింది. దీంతోపాటు సంఘాల లీడర్లు మహిళలు వెళ్లిపోతుండగా అడ్డుకున్నారు. మీరు వెళ్లిపోతే పేర్లు నమోదు చేసుకుంటామని హెచ్చరించారు. అయినా సంఘాల సభ్యులు తగ్గకుండా వెళ్లిపోయారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి: డీఎస్పీ శ్రీలత

కదిరి, ఫిబ్రవరి 3: పట్టణంలోట్రాఫిక్ నింబధనలు పాటించాలని డీఎస్పీ శ్రీలత సూచించారు. పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శనివారం ఆమె స్థానిక జ్యువెలరీ వ్యాపారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇక్బాల్‌రోడ్డును వన్‌వే చేస్తున్నట్లు చెప్పారు. రానున్న కాలంలో సాధారణ ఎన్నికలతోపాటు, ఖాద్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు కూడా ఉన్నాయని, ఈ క్రమంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా నిబంధనలు పాటించాలని తెలిపారు. ఎటువంటి పరిస్థితుల్లోనూ ఉదయం వేళల్లో ఇక్బాల్‌రోడ్డులో దుకాణాల వద్ద లోడింగ్, అన్‌లోడింగ్ చేయకూడదన్నారు. రాత్రి వేళల్లో మాత్రమే చేసుకోవాలన్నారు. వ్యాపారులు నిబంధనలు తప్పక పాటించాలని సూచించారు. సమావేశంలో పట్టణ సీఐ పుల్లయ్య, ఎస్‌ఐ బాబ్‌జాన్, బంగారు వ్యాపారుల సంఘం నాయకుడు మేడా వరప్రసాద్, ఇతర వ్యాపారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీలత

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ముదిగుబ్బ, ఫిబ్రవరి3: మండల కేంద్రంలోని కస్తూరిబా కాలనీ సమీపంలో శనివారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన లోకేష్, ఆసిఫ్ ద్విచక్ర వాహనంలో బత్తలపల్లి వైపునకు వెళుతున్నారు. మీసాల పల్లెకు చెందిన హరి మరో ద్విచక్ర వాహనంలో అదే వైపునకు వెళుతున్నాడు. కాగా కస్తూరిబా కాలనీ సమీపంలోకి రాగానే ఆ రెండు ద్విచక్ర వాహనాలు అదుపు తప్పి ఢీకొన్నాయి. ప్రమాదంలో ఆ ముగ్గురికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే క్షతగాత్రులను 108 వాహనంలో బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

యువకుడిపై ఎస్సీ,ఎస్టీ కేసు

కదిరి, ఫిబ్రవరి 3: మున్సిపాలిటి పరిధిలోని కుటాగుళ్లలో ఉదయ్‌కుమార్‌రెడ్డి అనే యువకుడు పక్కింటిలో ఉన్న ఓ ఎస్టీ యువతిపై అసభ్యకరంగా ప్రవర్తించడంతో ఎస్సీ, ఎస్టీకేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ పుల్లయ్య తెలిపారు. శనివారం ఆయన తెలిపిన వివరాల మేరకు.. కుటాగుళ్లలో నివాసముంటున్న ఉదయ్‌కుమార్‌రెడ్డి, తమ పక్కింటిలో వాసముంటున్న ఓయువతితో శుక్రవారం రాత్రి అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఆ యువతి గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కలవారు వచ్చి కాపాడారు. తనపై అసభ్యగా ప్రవర్తించినట్లు ఆయువతి ఫిర్యాదు చేయడంతో.. ఎస్సీ,ఎస్టీ కేసుతో పాటు, అసభ్య ప్రవర్తన సెక్షన్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు చెప్పారు.

'పేదలపై చిత్తశుద్ధి లేని ప్రభుత్వం'

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 3: పేదలపై రాష్ట్ర ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని సీఐటీయూ జిల్లా కోశాధికారి సాంబశివ పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించాలంటూ మండలకేంద్రంలో భవన నిర్మాణ కార్మికులు చేపట్టిన రిలేదీక్ష శనివారం నాటికి ఐదో రోజుకు చేరుకుంది. ఈ దీక్షకు సాంబశివ మద్దతు తెలిపి మాట్లాడారు. వైసీపీ పాలనలో ఆక్రమణలకు భూములుంటాయని, అర్హులైన పేదలకు, భవన నిర్మాణ కార్మికులకు పట్టాలివ్వడానికి భూములుండవా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇళ్లులేని భవన కార్మికులకు ఇంటిపట్టాలివ్వాలన్నారు. లేని పక్షంలో దశలవారీగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. దీక్షలో సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు కుళ్లాయప్ప, శ్రీరాములు, భవన నిర్మాణ కార్మిక మండల అధ్యక్ష, కార్యదర్శులు క్రిష్టప్ప, కేశప్ప, నాగవేణి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా తప్పులపై జిల్లా అధికారులు సీరియస్


తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు జాబితాను పరిశీలిస్తున్న బీఎల్వోలు

బత్తలపల్లి, ఫిబ్రవరి 3: మండలంలోని ఓటర్ల తుది జాబితా తప్పుల తడకపై శనివారం ఆంధ్రజ్యోతిలో గ, హో ఓటర్లే అన్న శీర్షికన క థనం ప్రచురితమైంది. దీనిపై జిల్లా యంత్రాంగం సీరియస్ అయింది. దీంతో రెవెన్యూ అధికారులు, బీఎల్వోలు అలర్ట్ అయి ఏయే గ్రామాలలో ఏఏ బూత్‌లలోని ఓటర్ల జాబితాలో తప్పులు ఉన్నాయో.. పరిశీలిం చారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో కూర్చొని జాబితాలను పరిశీలిస్తూ నకిలీ ఓట్లు ,డబుల్ ఎంట్రీలు, చనిపోయిన వారి ఓట్లు తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. అయితే గ్రామాల్లో తిరిగి తప్పులను సరిదిద్దాల్సి బీఎల్వోలు తహసీల్దార్ కార్యాలయంలో కూర్చొని రాజకీయ నాయకులకు ఫోన్లు చేసుకుంటూ సవరణలు చేస్తే ఎలా అని పలువురు మండిపడుతున్నారు.

ఆంధ్రజ్యోతి స్పందన

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసుల పంపిణీ

కొత్తచెరువు, ఫిబ్రవరి 3: మండలంలోని కనిశెట్టిపల్లి, తిరుమలదేవరపల్లి గ్రామాలలోని పాఠశాలల విద్యార్థులకు కిద్మత్ ఏ ఖల్క్ చారిటబుల్ ట్రస్టు సభ్యుడు షామీర్ శనివారం ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జూనియర్ ఎన్టీఆర్ అభిమాని శ్రీకాంత్ తన జన్మదినం సందర్భంగా సహకారం అందజేశారని, దీంతో విద్యార్థులకు భోజన ప్లేట్లు, గ్లాసులు, తిను బండారాలు అందజేశామని తెలిపారు. సభ్యులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

బత్తలపల్లి, ఫిబ్రవరి 3: మండలకేంద్రంలో డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు శనివారం వాహనాల తనిఖీ నిర్వహిచా రు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ వాహనదారులు నిబంధనల ప్రకారం వాహనాలు నడపాలని సూచించారు. సీఐ ఆరోహణరావు, ఎస్‌ఐ శ్రీనివాసులు,సిబ్బంది పాల్గొన్నారు.

'మెగా డీఎస్సీ కాదు.. దగా డీఎస్సీ'

నల్లమాడ, ఫిబ్రవరి 3: ప్రభుత్వం ప్రకటించినది మెగా డీఎస్సీ కాదని, అది వైసీపీ దగా డీఎస్సీ అని టీడీపీ మండల కన్వీనర్ ఫైలే శివశంకర్, మైనారీ నాయకుడు సలాంఖాన్ శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. అధికారంలోకి రాకముందు జగన్‌రెడ్డి ప్రతిఏడాది జాబ్‌క్యాలెండర్ విడుదల చేసి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పారని, అయితే అధికారంలోకొచ్చాక నిరుద్యోగులను నట్టేట ముంచారని దుయ్యబట్టారు. ప్రస్తుతం ఉపాధ్యాయ పోస్టులు చాలా ఉంటే.. కేవలం 6,100 మాత్రమే భర్తీ చేస్తామని చెప్పడం సరికాదన్నారు. ఎన్నికల సమీపిస్తున్న సమయంలో మరోసారి ప్రజలను మభ్యపెట్టడానికే ఈ డీఎస్సీ ప్రకటించారని పేర్కొన్నారు.

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు


సరోజమ్మ

కదిరి, ఫిబ్రవరి 3: తలుపుల మండలకేంద్రంలోని గాంధీనగర్‌కు చెందిన సరోజమ్మ అనే మహిళ ఈనెల 1వ తేదీ నుంచి కనిపించడం లేదని ఆమె అన్న నాగరాజు ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. సరోజమ్మకు తలుపుల మండలం ఏపులపల్లికి చెందిన మల్లికార్జునతో 24 ఏళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు కుమారైలు ఉన్నారు. వారి చదువుల నిమిత్తం తలుపుల మండలకేంద్రంలోని గాంధీనగర్‌లో నివాసముంటున్నారు. కాగా ఈనెల 1వతేదీన రాత్రి జొన్నరొట్టెలు అమ్మిన డబ్బులు తీసుకురావడానికని ఆమె ఇంటి నుంచి బయటికి వెళ్లారు. తర్వాత తిరిగి రాలేదని, బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ తెలియలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎవరికైనా ఆమె ఆచూకీ తెలిస్తే తలుపుల పోలీస్ స్టేషన్‌కు, 9676691846 నంబరుకు సమాచారం తెలపాలని పోలీసులు కోరారు.

కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

తనకల్లు, ఫిబ్రవరి 3: మండలంలోని గందోడివారిపల్లికి చెందిన సూర్యనారాయణ కర్ణాటక మద్యంను అక్రమంగా తరలిస్తుండగా శనివారం పట్టుకుని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు. కర్ణాటక నుంచి 115 టెట్రా ప్యాకెట్లును తీసుకొస్తుండగా.. మండలంలోని పెద్దపల్లి వద్ద అరెస్టు చేశామన్నారు. అనంతరం మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, అతడిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

కాల భైరవ ఆలయంలో దీపోత్సవం

ధర్మవరం, ఫిబ్రవరి 3: పట్టణంలోని చక్రవర్తి థియేటర్ ఎదురుగా ఉన్న కాలభైరవ స్వామి ఆలయంలో శనివారం దీపోత్సవ, కంకణధారణ కార్యక్రమాలను అర్చకుడు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత స్వామి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. తర్వాత దోష నివారణ పూజలను నిర్వహించారు. భక్తులు కాలభైరవస్వామి ఎదుట దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అదేవిధంగా కంకణధారణ చేపట్టారు.

ఎన్‌పీకుంటలో ప్రచార రథయాత్ర

నంబులపూలకుంట, ఫిబ్రవరి 3: అయోధ్య సీతారాముల కల్యాణోత్సవాన్ని ఈనెల 21వ తేదీన కదిరి పట్టణంలోని బాలుర కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించనున్నారు. ఈ కల్యాణోత్సవ ప్రచారానికి సంబంధించిన రథయాత్ర శనివారం మండలకేంద్రంలో కొనసాగింది. స్థానికులు రథానికి ఘన స్వాగతం పలికి పూజలు చేశారు. ఈ కల్యాణోత్సవానికి ప్రముఖ ప్రవచన కర్త చాగంటి కోటేశ్వర రావు హాజరు కానున్నారని, భక్తులు పెద్దఎత్తున తరలిరావాలని రథయాత్ర నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో నిర్వాహకులు వెంకటేష్, రామమోహన్, గురివిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏడీసీసీ బ్యాంకు వార్షికోత్సవం

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి3: పట్టణంలోని ఏడీసీసీ బ్యాంకు 106వ వార్షికోత్సవ వేడుకలను శనివారం సిబ్బంది ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మేనేజర్ నాగార్జున, అసిస్టెంట్ మేనేజర్లు పురుషోత్తం, నాగవేణి, రహమ్‌తుల్లాలు సిబ్బందితో కలిసి కేక్ కట్ చేసి పంచిపెట్టారు.

ఎలుగుబంటి సంచారం

- ఆందోళనలో ప్రజలు


గంగులవాయిపాళ్యంలో రాత్రివేళ గుడివద్ద తిరుగుతున్న ఎలుగుబంటి

మడకశిరటౌన్, ఫిబ్రవరి 3: మడకశిర నియోజకవర్గంలోని అటవీ ప్రాంతాలకు సమీపాన ఉన్న గ్రా మాల్లో ఎలుగుబంట్ల సంచారం పెరుగుతుండటంతో ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలోని గంగుల వాయి పాళ్యం, బుడ్డారెడ్డిపాళ్యం, తండాలు తదితర గ్రామాల్లో ఎలుగుబంట్లు సంచరిస్తున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు తెలిపారు. గంగులవాయి పాళ్యం గ్రామంలోకి ఇటీవల ఎలుగుబంటి రోజూ వస్తోందని, రాత్రి వేళల్లో ఇళ్ల నుంచి బయటకు రావాలంటే భయం వేస్తోందని గ్రామస్థులు అంటున్నారు. నెల రోజుల కిందట కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన చంద్రబావి గ్రామ సమీపంలో ఓ మహిళపై ఎలుగుబంటి దాడి చేయడంతో ప్రజలు మరింత ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఎలుగుబంట్లు తదితర వన్యప్రాణులు గ్రామాల్లోకి రాకుండా గట్టి చర్యలు చేపట్టాలని గ్రామీణులు కోరుతున్నారు.

8న ఉద్యోగుల కార్యవర్గం ఎంపిక

మడకశిర రూరల్, ఫిబ్రవరి 3: ఉద్యోగుల సంఘం నియోజకవర్గ కార్యవర్గాన్ని ఈ నెల ఎనిమిదో తేదీన ఎన్నుకోనున్నట్లు ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు గోవిందప్ప శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశాన్ని మడకశిర పట్టణంలోని విశ్రాంతి భవనంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ ఉద్యోగులతో పాటు, ఐదు మండలాలల్లోని అన్ని శాఖల ఉద్యోగులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆడ్వాణీకి భారతరత్న పట్ల హర్షం

గోరంట్ల, ఫిబ్రవరి 3: బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంశాఖ మాజీ మంత్రి లాల్ కృష్ణ ఆడ్వాణీకి కేంద్రం ప్రభుత్వం భారతరత్న ప్రకటించడం పట్ల ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ హర్షం వ్యక్తం చేశారు. దేశం గర్వించతగ్గ నాయకుడైన ఆడ్వాణీకి అత్యున్నత భారత రత్న పురస్కారం లభించడం దేశ ప్రజలకు ఎంతో సంతోషకరమైన సుదినంగా ఆయన తెలిపారు

హిందూపురం అర్బన్: భారతీయ జనతాపార్టీ అగ్ర నేత ఎల్‌కే ఆడ్వాణీకి కేంద్ర ప్రభుత్వం భారతరత్న అవార్డు ప్రకటించడంపై బీజేపీ తిరుపతి జిల్లా ఇన్‌చార్జ్ పీడీ పార్థ సారథి హర్షం వ్యక్తం చేశాడు. ఆయన దేశంలోనే ఉత్తమ పార్లమెంటేరియన్‌గా, గృహ మంత్రిగా, ఉప ప్రధానిగా ఉత్తమ సేవలు అందించారన్నారు. ఈ రోజు బీజేపీ అధికారంలో ఉన్నదంటే అందుకు ఆయన చేసిన కృషి ఎంతగానో ఉందన్నారు. దేశం దశ దిశ మారడానికి ఆడ్వాణీ ఎంతగానో పాటుపడ్డారన్నారు.

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

మడకశిరటౌన్, ఫిబ్రవరి 3: పట్టణంలోని ఎస్‌వైటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత టైలరింగ్ కోర్సులు ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్బయ్య, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి అబ్దుల్ ఖయ్యూం తెలిపారు. వారు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ పూర్తిచేసిన లేక ఫెయిల్ అయిన వారు ఈ కోర్సులకు అర్హులు అన్నారు. టైలరింగ్ కోర్సులపై నాలుగు నెలలపాటు శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశం కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి గలవారు స్కిల్‌హబ్ కోఆర్డినేటర్ సాయిగణేష్ సెల్ ఫోన్ నెం. 9966682246కు సంప్రదించాలని కోరారు.

6న సామాజిక తనిఖీ ప్రజావేదిక

మడకశిర రూరల్, ఫిబ్రవరి 3: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణంలో ఈ నెల 6న సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఏపీఓ శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. గత యేడాది 2022 ఏప్రిల్ నెల నుంచి 2023 మార్చి నెల వరకు జరిగిన ఉపాధి హామి పనులకు సంబంధించి సామాజిక తనిఖీ బృందం తనఖీలు నిర్వహించినట్లు తెలిపారు. దీనిపై ప్రజా వేదికను నిర్వహిస్తున్నట్లు ఏపీఓ తెలిపారు. కూలీలు, సంబంధిత అధికారలు పాల్గొనాలని కోరారు

ట్రాన్స్‌కో ఏఈని నియమించండి

అగళి, ఫిబ్రవరి 3: మండలానికి ట్రాన్స్‌కో ఏఈ లేకపోవడంతో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో పనిచేసిన ఏఈ శ్రీనివాస్ బాబు చౌదరి అనారోగ్యంతో మృతిచెందాడు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆరు నెలలుగా మండలానికి విద్యుత్ ఏఈ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మండల ప్రజలు వాపోతున్నారు. కొత్తగా బోర్ల తరఫున రైతులు సర్వీస్ కావాలన్నా, విద్యుత్ సరఫరా సక్రమంగా జరగాలన్న ఏఈ లేనందువల్ల పనులు జరగడం లేదన్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని వెంటనే అగళి మండలానికి ట్రాన్స్‌కో ఏఈ నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఎంపీడీఓగా రాజేంద్రప్రసాద్ బాధ్యతలు

అగళి, ఫిబ్రవరి 3 : స్థానిక మండల ఎంపీడీఓగా రాజేందప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు జిల్లా నుంచి ఇక్కడికి వచ్చినట్లు ఆయన తెలిపారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీఓ రవిప్రసాద్ కర్నూలు జిల్లాకు బదిలీ అయ్యారు. త్వరలో ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఈ బదిలీలు జరిగినట్లు ఎంపీడీఓ తెలిపారు.

రఘువీరాపై మంత్రి ఆరోపణలు అవాస్తవాలు: మాజీ ఎమ్మెల్యే

మడకశిరటౌన్, ఫిబ్రవరి 3: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శుక్రవారం మడకశిరలో పర్యటించిన సందర్భంగా మాజీ మంత్రి రఘువీరా రెడ్డిపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని, అందులో వాస్తవాలు లేవని మా జీ ఎమ్మెల్యే కే సుధాకర్ అన్నారు. ఆయన శనివారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. పదవుల కోసం రఘువీరారెడ్డి ఏనాడూ ఆశపడలేదని, రాహుల్ గాంధీకి అవమానం జరిగిందనే తిరిగి రాజకీయాల్లోకి వచ్చారన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా అభివృద్ధి కోసం రఘువీరా ఎంతో కృషి చేశారని, అవినీతికి పాల్పడ్డారనడంలో వాస్తవం లేదన్నారు. సుప్రీం కోర్టు జడ్జితో విచారణకైనా తాము సిద్ధంగా ఉన్నామన్నారు.

యువతి ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, ఫిబ్రవరి 3: పట్టణంలోని బేతేల్ చర్చి వీధిలో నివాసముంటున్న శిరీష అనే యువతి విషద్రావకం తాగి శనివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంకటరావు కుమార్తె అయిన శిరీష మండలంలోని గార్మెంట్స్ పరిశ్రమలో పనిచేస్తున్నారు. ఆమె శనివారం సాయంత్రం ఇంట్లో విషద్రావకం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడంతో అస్వస్తతకు గురైంది. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా, డాక్టర్ పావని వైద్యచికిత్సలు అందించారు. ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియరాలేదు. ఆమెను మెరుగైన చికిత్సకోసం హిందూపురం తీసుకెళ్లేందుకు 108కి ఫోన్‌చేయగా గంటకు పైగా సమయం పడుతుందని చెప్పారు. దీంతో ఓ ప్రయివేటు వాహనంలో ఆమెను హిందూపురం ఆసుపత్రికి తరలించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

కర్ణాటక మద్యం సీజ్

గుడిబండ, ఫిబ్రవరి 3 : అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్న ఓ వ్యక్తిని పట్టుకుని, అతడి వద్ద మద్యం బాటిళ్లను సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. స్థానిక ఇటికేపల్లి చెక్‌పోస్టు సమీపంలో కర్ణాటకకు చెందిన ఓ వ్యక్తి అక్రమంగా తరలిస్తున్న 400 ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకుని అతడిని అరెస్ట్‌చేసినట్లు ఎస్ఐ మునిప్రతాప్ తెలిపారు. నిందితుడిపై కేసు నమోదుచేసి రిమాండుకు తరలించినట్లు తెలిపారు. మండలంలో మట్కా, పేకాట, మద్యం తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని, వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంట సిబ్బంది పాల్గొన్నారు.



రహమత్‌పురంలో రోడ్డుకు అడ్డంగా వేదిక



మహిళలు వెళ్లిపోతుండగా బోర్డువద్ద కాపలా ఉన్న ఎస్ఐ హోరున్ బాషా

మంత్రా... మజాకా..!

- రహదారులకు అడ్డంగా వేదికలు
- ప్రయాణికులకు చుక్కలు
- సభకు రాకపోతే ఆసరా కట్ అంటూ బెదిరింపులు
- జనం వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు, సంఘాల లీడర్లు

హిందూపురం, ఫిబ్రవరి 3 : ఎవరేమనుకున్నా, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది వచ్చినా, మేమింతేనంటూ వైసీపీ నాయకులు మరోసారి నిరూపించుకున్నారు. మంత్రా మజాకా అన్న రీతిలో సభా వేదికలు ఏర్పాటు చేయడంతో శనివారం పట్టణంలోని పలు రహదారుల్లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పట్టణంలోని ఏడుచోట్ల సమావేశాలు నిర్వహించారు. దీనికి రాష్ట్రమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరయ్యారు. దీంతో అధికారులు అత్యుత్సాహం వ్యవహరించి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగించారు. ఇదిచూసిన జనం తీవ్ర విమర్శలు చేశారు.

రహదారులకు అడ్డంగా వేదికలు

పట్టణంలో ఏడు చోట్ల శనివారం సమావేశాలు నిర్వహించారు. తెల్లవారు జామునుంచే మేళాపురం సర్కిల్‌లో ఓ వైపు రహదారికి అడ్డంగా వేదిక ఏర్పాటు చేయడంతో రోడ్డు బ్లాక్ చేశారు. దీంతో రాకపోకలు ఒకవైపే జరిగాయి. దీనివల్ల ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఆ తరువాత కేవీఆర్ ఫంక్షన్‌హాల్‌వద్ద వాహనాలు అడ్డంగా పెట్టడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. చర్చిగ్రౌండ్‌వద్ద, రహమత్‌పురం రైల్వే స్టేషన్‌కు వెళ్లేదారిలో, వీడి రోడ్డులో వేదిక ఏర్పాటు చేయడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆదారిలో రాకపోకలు తీవ్ర అంతరాయం ఏర్పడింది.



మంత్రిరాకతో వాహనాలను నిలిపివేసిన డీఎస్పీ

అయితే దీనిపై తీవ్ర విమర్శలు చేసినా వైసీపీ నాయకులు మాత్రం మేమింతేనని నిరూపించుకున్నారు. ప్రజా సమస్యలపై ఐదు నిమిషాలు రోడ్డుపై బైఠాయిస్తామంటే అనుమతులు లేవని, 30యాక్ట్ అమలులో ఉందని పోలీసులు చెబుతారు. అలాంటిది పోలీసులే రోడ్డుపై ఉండి ట్రాఫిక్‌ను మళ్లించడం ఎంతవరకు సమంజసమని ప్రయాణికులు ప్రశ్నించారు. పోలీసులు స్వామిభక్తిని చాటుకున్నారు. చంద్రబాబు అరెస్ట్ నేపథ్యంలో రోడ్డుపై ర్యాలీగా వెళ్తుంటే అరెస్ట్‌చేసిన పోలీసులు శనివారం పట్టణంలోని పలు రహదారులకు అడ్డంగా వేదక ఏర్పాటు పట్ల ఏం సమాధానం చెబుతారని ప్రతిపక్షాలు ప్రశ్నించాయి. రోడ్డుకు అడ్డంగా వేదిక ఏర్పాటుచేసి ప్రయాణికులకు చుక్కలు చూపించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చినవారు పట్టణంలో పలుచోట్ల తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

ఆసరా కట్ అంటూ బెదిరింపులు

మంత్రి సమావేశానికి కనీసం ఐదేసి వార్డులకు వంద మంది కూడా రాలేదు. కేవలం మహిళా సంఘాల సభ్యులతోనే సమావేశాలు నిర్వహించారు. పట్టణంలో మహిళా సంఘాల లీడర్లు శుక్రవారం నుంచే సభ్యులతో సమావేశమై మంత్రి కార్యక్రమానికి రాకపోతే ఆసరా పడదని, చెక్కులు చేయమని బెదిరించారు. ఎవరెవరు వస్తారో వారి పేర్లు నమోదు చేసుకుంటామని రానివారికి ఆసరా కట్ చేయిస్తామని బెదిరించారు. దీంతో చేసేదిలేక మంత్రి సమావేశానికి సంఘాల సభ్యులు హాజరయ్యారు. పట్టణంలో ఏడు చోట్ల జరిగిన కార్యక్రమాలకు మహిళా సంఘాల సభ్యులే తప్ప వైసీపీ శ్రేణులు హాజరుకాకపోవడం విశేషం.

సమావేశం ప్రారంభం కాగానే వెళ్లిపోయిన మహిళలు

సమావేశం ప్రారంభమైన వెంటనే మహిళలు వెళ్లిపోవడం కనిపించింది. మేళాపురం సర్కిల్‌లో సమావేశం ప్రారంభమైన ఐదు నిమిషాలకే ఒక్కొక్కరు లేచి వెళ్లిపోయారు. మంత్రి మాట్లాడే సమయానికి జనం అంతంతమాత్రమే ఉండటంతో ప్రతిచోట మంత్రి ఐదు నిమిషాలలోపే మాట్లాడారు. జనం వెళ్లిపోతుండటంచూసి సబ్ డివిజనల్ అధికారి జనం వెళ్లిపోకుండా అడ్డుకోవాలని రోడ్డుకు అడ్డంగా బోర్డులు పెట్టించారు. ఎస్ఐ హోరున్‌బాషా వచ్చి జనాన్ని వెళ్లిపోకుండా అడ్డుకోవడం కనిపించింది. దీంతోపాటు సంఘాల లీడర్లు మహిళలు వెళ్లిపోతుండగా అడ్డుకున్నారు. మీరు వెళ్లిపోతే పేర్లు నమోదు చేసుకుంటామని హెచ్చరించారు. అయినా సంఘాల సభ్యులు తగ్గకుండా వెళ్లిపోయారు.

పెనుకొండ నుంచి ఎమ్మెల్యేగా పోటీచేస్తా : బీకే



విలేకరులతో మాట్లాడుతున్న బీకే పార్థసారథి

పెనుకొండ, ఫిబ్రవరి 3 : రాబోయే ఎన్నికల్లో తను పెనుకొండ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తానని, ఇందులో ఎవరికీ ఎలాంటి అనుమానాలు అవసరం లేదని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి అన్నారు. ఆయన శనివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. పెనుకొండ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి విషయంలో నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలకు కొన్ని అనుమానాలు చోటుచేసుకున్నాయన్నారు. తాను ఎమ్మెల్యేగా కాకుండా ఎంపీగా పోటీచేస్తానని నాయకులు, కార్యకర్తల్లో అపోహలున్నాయన్నారు. ఈ విషయంలో కార్యకర్తలు, అభిమానులు ఆలోచించాల్సిన అవసరం లేదని, తాను పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థిగానే పోటీలో ఉంటా నని తెలిపారు. రాష్ట్రంలో ఏ నియోజకవర్గానికి ఇంతవరకు టీడీపీ అభ్యర్థులను ఖరారు చేయలేదన్నారు. టికెట్ ఆశించే అభ్యర్థులకు సంబంధించి వారికి ప్రతిపక్ష అభ్యర్థిని ఎదుర్కొనే సత్తా ఉందా లేదా, ఏ అభ్యర్థికి ఏ స్థానం టికెట్ కేటాయిస్తే విజయం సాధిస్తారు, ప్రజాభిమానం ఎవరికి ఉందనే అంశాలను అదిష్ఠానం పరిశీలిస్తుందన్నారు. ఇప్పటికే ఆశావహుల బయోడేటాను తీసకున్నారని, సర్వేల ప్రకారం అభ్యర్థులను నియమిస్తారని తెలిపారు. తాను 37ఏళ్లుగా పార్టీ అభివృద్ధి కోసం కష్టపడి పనిచేస్తున్నానని, ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. తనకు సంబంధించిన వివరాలు అధిష్టానానికి తెలుసన్నారు. పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో తాను ఎమ్మెల్యే అభ్యర్థి బరిలో ఉంటానన్నారు. నాయకులు, కార్యకర్తలు తనకు అండగా ఉండి సహకరించాల ని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జీవీపీ నాయుడు, యాదవసంఘం నాయకుడు కేశవయ్య, చిన్నప్పయ్య, నరహరి, గుట్టూరు నాగరాజు, లక్ష్మీనారాయణరెడ్డి, వీజీపాళ్యం శ్రీనివాసులు, ఆదిశేష, కన్వీనర్ రవిశంకర్, సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

అది దగా డీఎస్సీ: గుండుమల

మడకశిర టౌన్, ఫిబ్రవరి 3: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కొత్త డ్రామాకు తెరతీశారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి అన్నారు. కొత్తగా డీఎస్సీ అంటూ ప్రకటించారని, అది దగా డీఎస్సీ అన్నారు. ఆయన శనివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... నిరుద్యోగులను మరోసారి వం చించడానికే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సిద్ధ మయ్యారని మండిపడ్డారు. రాష్ట్రంలో 50,892 ఉపాధ్యా య పోస్టులు ఖాళీగా ఉంటే... కేవలం తూతూ మం త్రంగా 6100 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి నిరుద్యో గులను మరోసారి మోసం చేశారన్నారు. కేంద్రప్రభుత్వం సైతం రాష్ట్రంలో 50892 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు గుర్తించినట్లు గుర్తుచేశారు. యువ తను వంచించి రాష్ట్రాన్ని నిరుద్యోగ ఆంధ్రప్రదేశ్‌గా జగన్‌మోహన్‌రెడ్డి మార్చారని దుయ్యబట్టారు. మద్యం, గంజాయి ఉత్పత్తి సైతం రాష్ట్రంలో పెరిగి పోతోందని అన్నారు. తెలుగుదేశం పార్టీ హయాంలో రాష్ట్రం పెట్టుబడులకు హబ్‌గా మారితే ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రాన్ని గంజాయి హబ్‌గా మార్చారన్నారు. ముఖ్యమం త్రి సభ కోసం ఇంటర్మీడియట్ పరీక్ష వాయిదా వేయడం విడ్డూరంగా ఉందన్నారు. విద్యార్థుల జీవితాలతో ముఖ్యమంత్రి చెలగాటం ఆడుతున్నారని విమ్మంచారు.

ట్యాంకర్లతో సవిత తాగునీటి సరఫరా

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 3 : పట్టణంలోని పలు ప్రాంతాల్లో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించి, ప్రజల దాహార్తిని తీర్చేందుకు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత శ్రీకారం చుట్టారు. ఈ మేరకు సవిత ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత మంచినీటి సరఫరా కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. పట్టణంలోని అన్న క్యాంటిన్ వద్ద మాజీ సర్పంచ్ గుట్టూరుసూరి తదితరులు జెండా ఊపి ట్యాంకర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పెనుకొండ పట్టణంలో పది రోజుల నుంచి తాగు నీటి సరఫరా నెలకొందన్నారు. ఈ క్రమంలో ఎగువగడ్డ, రెడ్డివారి వీధి, పాత పోస్టాఫీసు, అల్విన్‌కాలనీ తదితర ప్రాంతాల ప్రజలు నీటి సమస్యను తమ దృష్టికి తీసుకురావడంతో సవితకు విన్నవించామన్నారు. దీనిపై స్పందించిన సవిత నాలుగు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు చర్యలు చేపట్ట డంతో వాటిని ప్రారంభించామని తెలిపారు. ఉచిత తాగునీటిని సరఫరా చేస్తున్న సవితను ప్రజలు అభినందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు త్రివేంద్ర, ప్రసాద్, సుబ్రహణ్యం తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి ట్యాంకర్లను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

ప్రత్యేక నిధులను బడ్జెట్‌లో కేటాయించాలి

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్

గోరంట్ల, ఫిబ్రవరి 3: ఆంధ్రప్రదేశ్ స్టేట్ రీఆర్గనైజేషన్ యాక్టు 2014 ప్రకారం రాష్ట్రానికి రావలసిన నిధులను ఈ బడ్జెట్‌లోనే కేటాయించాలని కాంగ్రెస్‌పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జ్ నరసింహులు కేంద్రాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని, దీనివలన కేంద్రం నుంచి 90శాతం నిధులు ఎక్స్‌గ్రేషియా రూపంలో విడుదలవుతాయని ఆయన శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనిధులను తిరిగి కేంద్రానికి చెల్లించనవసరం లేదన్నారు. 25మంది పార్లమెంటు సభ్యులున్న రాష్ట్రానికి రైల్వే బడ్జెట్‌లో రూ.వెయ్యి కోట్లు సాధించినందుకు మన ఎంపీలను ప్రజలంతా సన్మానించవలసిన అవసరం ఎంతైనా ఉందని ఎద్దేవా చేశారు. వెంటనే కేంద్రం రాష్ట్రానికి ప్రత్యేక హోదా ప్రకటించాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోందన్నారు.

అంబికాకు ఎంపీ టికెట్ ఇవ్వాలి

వాల్మీకి సంఘం నాయకులు

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 3: వాల్మీకి కులానికి చెందిన అంబికా లక్ష్మీనారాయణకు హిందూపురం ఎంపీ టికెట్ కేటాయించాలని వాల్మీకి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. వారు శనివారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ స్థాపించనప్పటి నుంచి వాల్మీకులు టీడీపీ వెన్నంటి ఉన్నారన్నారు. అప్పటి నుంచి ఇప్పటి దాకా హిందూపురంలో వాల్మీకులకు టీడీపీ ఎంపీ టికెట్ కేటాయించలేదన్నారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అంబికాకు ఎంపీ టికెట్ కేటాయించే విషంలో ఆలోచించాలని కోరారు. సమావేశంలో వాల్మీకి సంఘం నాయకులు ఆదినారాయణప్ప, మాజీ జడ్పీటీసీ సంతేబిదనూరు శ్రీరాములు, వైటీపీ వెంకటరమణ, ఆకుల సూరి, రాజు ఆదెప్ప తదితరులు ఉన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

కమిషనర్‌కు సీపీఎం నాయకుల వినతి



కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

పెనుకొండ, ఫిబ్రవరి 3 : నగర పంచాయతీ పరిధిలోని 20వార్డులతో పాటు సమీప గ్రామీణ ప్రాంతాల్లో పది రోజులుగా నీటి సమస్య తీవ్రంగా ఉండటంవల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం స్థానిక నాయకులు నగర పంచాయతీ కమిషనర్ వంశీకృష్ణభార్గవ్‌కు విన్నవించారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పలువురు గ్రామస్థులు, స్థానికులతో కలిసి కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. సీపీఎం నాయకులు హరీ, తిప్పన్న, బాబావలి, గంగాధర్, రాజారాం, అల్‌కౌసర్ సంస్థ అధ్యక్షుడు అహ్మద్ తదితరులు శనివారం వినతిని అందిస్తూ... పది రోజులుగా నీటి సరఫరా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ప్రజలు డబ్బులు పెట్టి ట్యాంకర్ల ద్వారా నీటిని కొంటున్నారని తెలిపారు. వేసవి కాలం రాకముందే తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని వేసవి ప్రారంభమైతే ప్రజల పరిస్థితి ఏంటని కమిషనర్‌ను ప్రశ్నించారు. ఇప్పటికైనా నీటి సమస్యను పరిష్కరించాలని వారు కోరారు.

కోట్లలో ప్రజాధనం దుర్వినియోగం

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత



సమావేశంలో మాట్లాడుతున్న సవిత

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 3 : రాష్ట్రంలో ప్రభుత్వ సలహాదారులకు కోట్లలో ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత ఆరోపించారు. పట్టణంలోని తన కార్యాలయంలో ఆమె శనివారం టీడీపీ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ .. రూపాయి సీఎంకు ఖరీదైన సలహాదారులు అవసరమా అని ప్రశ్నించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక సలహాదారులకు దాదాపు రూ.650కోట్లు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని, ఒక సజ్జల రామకృష్ణారెడ్డికే రూ.140కోట్లకు పైగా ప్రజాధనం అప్పగించారని విమర్శించారు. ప్రజలకు, ప్రజాధనానికి బాధ్యతగా ఉండాల్సిన ముఖ్యమంత్రి సలహాదారులకు ప్రజాధనాన్ని రూ. కోట్లలో ఇవ్వడం వల్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దుస్థితి పరాకాష్టకు చేరిందన్నారు. సలహాదారులను స్పెషల్ కేటగిరి కింద నియమించి, వారికి క్యాబినెట్ హోదా ఎలా కల్పిస్తారన్నారు. ఇప్పటికైనా ప్రజలు, మేధావులు, కులమత ప్రాంతాలకు అతీతంగా ఆలోచనచేసి రాష్ట్ర భవిష్యత్తును కాపాడటానికి ముందుకు రావాలని సవిత పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పలువురు పాల్గొన్నారు.

మోరుబాగల్‌లో పీహెచ్‌సీ ఏర్పాటుకు పరిశీలన



పీహెచ్‌సీ ఏర్పాటుకు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి

గుడిబండ, ఫిబ్రవరి 3 : మండలంలోని మోరు బాగల్ గ్రామంలో ప్రభుత్వం మంజూరు చేసిన ప్రాథమిక ఆ రోగ్యకేంద్రం ఏర్పా టుకు డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి శనివారం పరిశీలించారు. ఈనెల 15న ప్రాథమిక ఆరో గ్యకేంద్రం ఏర్పాటు చేసేందుకు కార్యాల యాన్ని సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ గ్రామంలో పీహెచ్‌ఎసీ ఏర్పాటు వల్ల చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని ఆయన తెలిపారు. ఆయన వెంట వైద్యాధికారులు భారతి, వేణు గోపాల్‌రావు, సౌందర్య, శ్రీనివాస్, ఆరోగ్య వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కళాశాల విద్యార్థుల శ్రమదానం



ఎముకలగుట్టపల్లిలో శ్రమదానం చేస్తున్న విద్యార్థులు

గోరంట్ల, ఫిబ్రవరి 3: మండలంలోని ఎ ముకలగుట్ట పల్లిలో ఎస్ఏపీఎస్ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శ్రమదాన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ప్రత్యేక శిబిరం ద్వారా గ్రామంలోని మంచినీటి ట్యాంక్, ప్రాథమిక పాఠశాల వద్ద మురుగునీటి కాలువలు శుభ్రం చేసి, కంపచెట్లు తొలగించి శుభ్రం చేశారు. పరిసరాల పరిశుభ్రత వలన కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. ఈకార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ బాబు, విద్యార్థులున్నారు.

పెనుకొండ రూరల్ : ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన కొవిడ్-19పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎన్ఎస్ఎస్ పీఓ హఫీజ్ పేర్కొన్నారు. పెనుకొండ నగర పంచాయతీలోని మంగాపురంలో శనివారం కొవిడ్‌పై గ్రామస్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కరోనాపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మాస్కుల ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ హఫీజ్, శంకర్‌నాయక్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

పురుగు పట్టిన మధ్యాహ్న భోజనం సరుకులు



గోధుమలకు పురుగులు పట్టిన దృశ్యం

పావగడ, ఫిబ్రవరి 3: మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా ప్రభుత్వం పాఠశాలలకు అందిస్తున్న గోధుమలు, బియ్యంలో పురుగులు కనిపిస్తున్నాయని తాలూకాలోని జాజూరాయన హళ్లిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆ గ్రామంలోని పాఠశాలలో శనివారం మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న సమయంలో అన్నం, సాంబారులో కూడా పురుగులు కనిపించాయని, భోజనం చేయడానికి ఆ విద్యార్థులు నిరాకరించారు. ఈ విషయాన్ని ప్రధానోపాధ్యాయుడి దృష్టికి తీసుకెళ్లామని ఆయన పట్టించుకోలేదని విద్యార్థులు అసహనం వ్యక్తం చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనం నిర్వహణ అధికారి శంకర్‌నాయక్‌కు సమాచారం అందించామని విద్యార్థులు తెలిపారు. ఆయన వెంటనే స్పందించి మధ్యాహ్న భోజనం వండేందుకు నిల్వ ఉంచిన ధాన్యాలను పరిశీలించారు. పురుగులు పట్టిన బియ్యం, గోధుమలను వెంటనే తిప్పిపంపి... నాణ్యమైన బియ్యం, గోధుమలను భోజనానికి వాడాలని పాఠశాల హెచ్‌ఎం, సిబ్బందికి ఆయన సూచించారు. దాదాపు 200 మందికిపైగా ఈ పాఠశాల లో విద్యాభ్యాసం చేస్తున్నారు. గడిచిన నాలుగు నెలల నుంచి భోజనం తిన్న తరువాత రోజూ పలువురు విద్యార్థులు అనారోగ్యంతో బాధపడుతున్నట్లు గ్రామస్థులు వాపోయారు. పురుగులు పట్టిన బియ్యంతో భోజనాలు వడ్డించడం దారుణమైన విషయమని ఆగ్రామస్తులు తెలియజేశారు.

ఎలుగుబంటి సంచారం - ప్రజల్లో ఆందోళన



గంగులవాయిపాళ్యంలో రాత్రివేళ గుడివద్ద తిరుగుతున్న ఎలుగుబంటి

మడకశిర టౌన్, ఫిబ్రవరి 3: మడకశిర నియోజకవర్గంలోని అటవీ ప్రాంతాలకు సమీపాన ఉన్న గ్రామాల్లో ఎలుగుబంట్ల సంచారం పెరుగుతుండటంతో ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందు తున్నారు. మండల పరిధిలోని గంగులవాయి పాళ్యం, బుడ్డారెడ్డిపాళ్యం, తండాలు తదితర గ్రామాల్లో ఎలుగుబంట్లు సంచరిస్తున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు తెలిపారు. గంగులవాయిపాళ్యం గ్రామంలోకి ఇటీవల ఎలుగుబంటి రోజూ వస్తోందని, రాత్రి వేళల్లో ఇళ్ల నుంచి బయటకు రావాలంటే భయం వేస్తోందని గ్రామస్థులు అంటున్నారు. నెల రోజుల కిందట కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన చంద్రబావి గ్రామ సమీపంలో ఓ మహిళపై ఎలుగుబంటి దాడిచేయడంతో ప్రజలు మరింత ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఎలుగుబంట్లు తదితర వన్యప్రాణులు గ్రామాల్లోకి రాకుండా గట్టి చర్యలు చేపట్టాలని గ్రామీణులు కోరుతున్నారు.